జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

విజయవాడ నగరంలో
రాఘవయ్య పార్క్ వద్ద గల
మన ఆఫీస్ లో
స్నేహా గ్రూప్ సభ్యులకు
సమావేశాలు
నిర్వహించుకునేందుకు
40 మంది వరకు
అవకాశం కల్పించబడును
వివరాలకు ఈ క్రింది నెంబర్లలో సంప్రదించగలరు
9000621111, 9440137451

సంపుటి 15 సంచిక 259 విశాఖపట్నం | శనివారం 04 జూన్ 2022 | 8 పేజీలు | వెల: 5.00



# వైసీపీ ముందస్తు సన్నాహాలా..?

గుంటూరు జూన్ 3, :వైసీపీ ముందస్తు సన్నాహాలు ప్రారంభించేసిందా. ఒక వైపు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విఫలం కావడం, మంత్రుల బస్సు యాత్ర తుస్సు మనడం.. మరో వైపు తెలుగుదేశం బాదుడే బాదుడు కార్యక్రమానికి జన స్పందన బ్రహ్మాండంగా ఉండటం, తెలుగుదేశం మహానాడు అంచనాలకు మించి విజయవంతం కావడంతో ఏపీలో అధికార వైసీపీకి ఉక్కపోత ప్రారంభమైంది. దీంతో ప్రజలలో తమ పట్టు సడలలేదని నిరూపించుకోవడానికి నానా తంటాలూ పడుతోంది(క్రమశిక్షణా సంఘం సిఫారసు అంటూ మాజీ మంత్రి కొత్తపల్లిపై సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే సహించేది లేదన్న సందేశాన్ని పార్టీ శ్రేణులకు ఇచ్చింది. అయితే ప్రజాభిమానం చెక్కు చెదరలేదని నిరూపించుకోకుంటే.. పార్టీ నుంచి వలసనలు పెరుగుతాయన్న భయం మాత్రం పార్టీని వెంటాడుతోంది. దీంతో పార్టీ ప్లీనరీ నిర్వహించి సత్తా చాటాలని, తద్వారా ముందస్తు సన్నాహాలు ప్రారంభించాలని వైసీపీ అధినేత జగన్ నిర్ణయించారు.ఇందుకు ముహూర్తం కూడా ఖరారు చేసేశారు. వైస్ జయంతి రోజైన జూలై 8 నుంచి రెండు రోజుల పాటు వైసీసీ ప్లీనరీ నిర్వహించాలని జగన్ నిర్వహించారు. 2017లో వైసీపీ ప్లీనరీ నిర్వహించిన గుంటూరు జిల్లాలో నాగార్జున వర్సిటీ ఎదురుగా ఉన్న స్థలంలోనే ఈ సారి కూడా ప్లీనరీ నిర్వహణకు జగన్ నిర్ణయించారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తెలుగుదేశం మహానాడును మించి వైసీపీ ప్లీనరీ విజయివంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని జగన్ పార్టీ ముఖ్య నేతలకు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు చెబుతున్నారు.జన సమీకరణ విషయంలో ఎటువంటి రాజీ వద్దనీ, (మిగతా 2లో..)

# కర్ణాటకలో ఘోర ప్రమాదం..

## 8 మంది హైదరాబాదీలు సజీవదహనం



బెంగళూరు : కర్ణాటకలోని కలబురిగి జిల్లాలో ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. కమలాపురలో వేగంగా వచ్చిన ఓ ప్రయివేటు బస్సు.. మినీ లారీని ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా బస్సులో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 8 మంది ప్రయాణికులు సజీవదహనం అయ్యారు. 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కలబురిగిలోని 3 ఆస్పత్రులకు తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది.

**ప్రమాద సమయంలో బస్సులో 35 మంది**

ప్రమాదానికి గురైన బస్సును ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సుగా గుర్తించినట్లు కలబురిగి ఎస్పీ ఇషా పంత్ పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఏడు నుంచి 8 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాద సమయంలో మాత్రం మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఉదయం 6:30 గంటలకు బీదర్ %--% శ్రీరంగపట్నం హైవేపై కమలాపుర సమీపంలో ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. ప్రమాదానికి గురైన బస్సు గోవా నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

**మృతులంతా హైదరాబాదీలే..**

ఈ ప్రమాదంలో మృతి చెందిన వారంతా హైదరాబాద్‌కు చెందిన వారని పోలీసులు నిర్ధారించారు. బర్త్ డే పార్టీ కోసం హైదరాబాద్‌కు చెందిన రెండు కుటుంబాలు మే 29న గోవా వెళ్లినట్లు సమాచారం. ఒక కుటుంబంలో 11 మంది, మరో కుటుంబంలో 21 మంది వెళ్లారు. డ్రైవర్‌తో పాటు ఇద్దరు క్లీనర్లు ఉన్నారు.

# అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో అమ్మోనియా లీక్..

## 200 మంది మహిళలకు అస్వస్థత..



అచ్యుతాపురం, (అనకాపల్లి) : అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ ఎస్ఈజెడ్ పరిధిలోని పోరస్ కంపెనీలో అమ్మోనియా వాయువు లీకైంది. సీడ్స్ యూనిట్లో ఒక్కసారిగా ఘాటైన వాయువు బయటకువచ్చింది. కంపెనీలో పనిచేస్తున్న 140 నుంచి 200 మంది మహిళలు అస్వస్థతకు గురయ్యారు. లీక్ అయిన వాయువు పీల్చడంతో మహిళలకు కళ్లమంటలు రావడంతో పాటు తల తిరగడం, వాంతులయ్యాయి. వెంటనే బాధితులను యాజమాన్యం హుటాహుటిన సెజ్లోని ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం వారిని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. తీవ్ర అస్వస్థతకు గురైన నలుగురు మహిళలకు బ్రాండిక్స్ ఎస్ఈజెడ్లో ఉన్న ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందజేస్తున్నారు.అమ్మోనియా పీల్చడంతో మహిళలు స్పృహ తప్పిపోయారని, ప్రాణాపాయం ఉండదని వైద్య సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు పోరస్ కంపెనీలో అమ్మోనియా లీకేజీని నిర్ధారించిన కాలుష్య నియంత్రణ మండలి అధికారులు దాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. చుట్టు ప్రక్కల ఫార్మా పరిశ్రమలు ఉండటంతో విషవాయువు గాలి విస్తరించిందని స్థానికులు చెబుతున్నారు.

# రాజ్యసభకు నలుగురు వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవం



అమరావతి, ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన నాలుగు రాజ్యసభ స్థానాలకు వైసీపీ అభ్యర్థులు పోటీ చేశారు. పోటీ చేసిన నలుగురు వైసీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థుల నుంచి ఎవరూ పోటీ చేయకపోవడంతో విజయసాయిరెడ్డి, నిరంజన్ రెడ్డి, ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు గెలిచినట్లు డిక్లరేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. నలుగురిలో ఇద్దరు తెలంగాణకు చెందిన వారు కావడం విశేషం. ఆ ఇద్దరిలో ఆర్.కృష్ణయ్యది తెలంగాణలోని వికారాబాద్ జిల్లా మొయిన్ పేట మండలం రాళ్లడుగుపల్లి గ్రామం. బీసీ సంఘ ఉద్యమ నేతగా పేరున్న కృష్ణయ్య 2014లో ఎల్బీ నగర్‌నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. నిరంజన్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా నిర్మల్ పట్టణానికి చెందిన వ్యక్తి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా సేవలందిస్తున్న నిరంజన్ రెడ్డి ఏపీ సీఎం వైఎస్ జగన్ కేసులను వాదిస్తున్నారు.

**సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన నూతన రాజ్యసభ సభ్యులు**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన ఎంపీలు శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. బీద మస్తాన్‌రావు, ఆర్ కృష్ణయ్య, ఎన్.నిరంజన్‌రెడ్డి నూతన ఎంపీలుగా రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి నుంచి డిక్లరేషన్ తీసుకున్నారు. అనంతరం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసిన నూతన రాజ్యసభ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కోనసీమ వివాదం రాజకీయ కుట్ర: పవన్ కల్యాణ్



అమరావతి: కోనసీమ వివాదంలో రాజకీయ కుట్ర ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ పేరును రాజకీయం చేశారని తప్పుబట్టారు. కోనసీమ ఘటనపై సీఎం జగన్, డీజీపీ స్పందించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కోనసీమ జిల్లాకు అంబేద్కర్ పేరును స్వాగతిస్తున్నామని ప్రకటించారు. ఒకే పార్టీలో రెండువర్గాల గొడవను కులఘర్షణగా మార్చారని దుయ్యబట్టారు. కోనసీమ తగులబడుతుంటే బస్సు యాత్ర చేస్తారా? అని ప్రశ్నించారు. ఘటనపై డీజీపీ స్పందించకుంటే కేంద్రమంత్రి అమిత్‌షాకు లేఖ రాస్తానని ప్రకటించారు. ఏపీలో ఘర్షణలు సృష్టించాలనే కుట్ర జరుగుతోందన్నారు. సమస్యలను పక్కదారిపట్టించడమే వైసీపీ సర్కార్ విధానమన్నారు. "ఏపీలో మళ్లీ వైసీపీ సర్కార్ వస్తే అరాచకమే. ప్రజలు ఒక్కసారి ఆలోచించాలి. YSR ప్రభుత్వంలో Y అంటే యువజనులకు ఉపాధి లేదు. అంటూ శ్రామికులకు ఉన్నపని తీసేశారు. S అంటే రైతులకు మద్దతుధర లేదు. ఇక R పేరు ఆ పార్టీకి ఎందుకో వారే చెప్పాలి?.. వైసీపీ ప్రభుత్వం ఉన్నంతకాలం పోలవరం పూర్తికాదు. కేంద్ర సొమ్మును ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారు" అని పవన్‌కల్యాణ్ ఆరోపించారు.




# ఉద్యోగులకు కేంద్రం షాక్..

## 8.1 శాతానికి ఈపీఎఫ్‌వో వడ్డీ కుదింపు!

(వివరాలు 2లో..)

# ప్రత్యేక కోర్టు బెయిల్ తిరస్కరిస్తే అప్పీల్ చేసుకోవాల్సిందే..

## ఉపా కేసులపై హైకోర్టు తీర్పు



అమరావతి : ఉపా చట్టం కింద ప్రత్యేక కోర్టు బెయిల్ తిరస్కరిస్తే దానిపై ధర్మాసనం ముందు అప్పీల్‌కు వెళ్లాలి.. ధర్మాసనమే విచారణ జరపాలి.. క్రిమినల్ పిటిషన్‌కు తావులేదని హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు (ఉపా) చట్టం కింద అరెస్టయిన మావోయిస్టు సానుభూతిపరుడు నాగన్న బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం క్రిమినల్ పిటిషన్‌కు విచారణార్హతలేదని త్రోసిపుచ్చింది. ధర్మాసనం ముందు అప్పీల్ చేసుకునే వెసులుబాటు కల్పించింది. మావోయిస్టులకు సహకారాన్ని అందిస్తున్నాడనే ఆరోపణతో విశాఖపట్నం జిల్లా ముంచంగిపుట్టు పోలీసులు వంగి నాగన్నను 2020లో అరెస్టు చేశారు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ చేపట్టింది.నాగన్నపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేయటంతో పాటు కస్టడీలో వెల్లడించిన వివరాల ఆధారంగా మరికొందర్ని నిందితులుగా చేర్చింది. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేసింది. కాగా అరెస్టయిన నాగన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయవాడ ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బెయిల్ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టు కొట్టేసింది. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ విచారణ జరిపారు. ఎన్ఐఏ తరుపున అసిస్టెంట్ (మిగతా 2లో..)

ప్రజా సమస్యలను మీడియా ద్వారా
ఎత్తిచూపుతూ మీడియా అధిపతిగా
ఎదగాలనుకుంటున్నారా?
అయితే రండి.
రెండు తెలుగు రాష్ట్రాల లోని 294
నియోజకవర్గాల్లో 294 మంది నాయకులు గాని
గ్రూపులుగా గాని ఆయా నియోజకవర్గాల్లో
మీడియా అధిపతులుగా చేస్తున్న ఏకైక ఛానల్
మాస్టర్ కి టీవీ ఛానల్ (అంబేద్కర్ టీవీ ఛానల్)
రండి... కదలి రండి... చేయి చేయి కలుపుదాం
అంబేద్కర్ కలలు కన్న రాజ్యాధికారాన్ని
(Master Key) సాధిద్దాం
వివరాలకు సంప్రదించండి
AP : 88869 11944
TS : 76600 27678, 88860 90484

## ఏపీఆర్జేసీ సెట్, ఆర్డీసీ సెట్-2022 పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి: డీఈఓ తాహెరా సుల్తానా



మచిలీపట్నం టౌన్ 3 , 2022 ప్రజాపాలన : ఈ నెల 5వ తేదీన ఉమ్మడి కృష్ణాజిల్లాలో నిర్వహించనున్న ఏపీఆర్జేసీ సెట్, ఆర్డీసీ సెట్–2022 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఈఓ తాహెరా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 2, 180 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా మచిలీపట్నంలో పది కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు తమకు కేటాయించిన కేంద్రానికి గంట ముందే హాల్ టికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు.

## పారిశ్రామిక ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం లో పాల్గొన్న బందరు ఎంపీ




ఢిల్లీ/మచిలీపట్నం 3 , 2022 ప్రజాపాలన :కృష్ణాజిల్లా మచిలీపట్నం శుక్రవారం మధ్యాహ్నం మచిలీపట్నం ఎంపీ బాలశౌరి మచిలీపట్నం పార్లమెంటు పరిధిలోని ఏర్పాటు చేయబోతున్న పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగాల కల్పన సంబంధిత తదితర విషయాలపై, మరియు దేశవ్యాప్తంగా పారిశ్రామిక ప్రగతి, ఉత్పత్తి తదితర అంశాలపై ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కేంద్ర పారిశ్రామిక అంతర్గత వాణిజ్యం, వర్తకశాఖ ఉన్నత అధికారులతో జరిగిన సమావేశంలో సంబంధితశాఖ నియమ నిబంధనల గురించి చర్చించడం జరిగింది. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు మరియు లోక్ సభ సభార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మన్ వల్లభనేని బాలశౌరి పారిశ్రామిక ఉత్పత్తిని గణనీయంగా పెంచి, జాతీయ స్థాయిలో పరిశ్రమలను నూతనంగా ఏర్పాటు చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన చేకూరుతుందని త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం జరిగింది.

## ఇద్దరు సస్పెన్షన్



గూడూరు/ మచిలీపట్నం 3 , 2022 ప్రజాపాలన :బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గూడూరు వీఆర్డీ, గూడూరు వీఆర్ఎలను సస్పెండ్ చేసినట్టు ఆర్డీఓ ఐ కిషోర్ తెలిపారు. గూడూరు వీఆర్వో ఆర్ఎన్ఎస్ ప్రసాద్, గూడూరు వీఆర్ఎ ఎం జనార్ధనరావు సస్పెండ్ చేసినట్టు ఆర్డీవో వెల్లడించారు. మండలాల్లో అనుమతులు లేకుండా ఎవరూ మట్టి తవ్వకాలు జరపవద్దని ఈ సందర్భంగా ఆర్డీఓ హెచ్చరించారు.

## ప్రత్యేక కోర్టు బెయిల్ తిరస్కరిస్తే అప్పీల్ చేసుకోవాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి)

సొలిసిటర్ జనరల్ ఎన్ హరినాథ్ వాదనలు వినిపించారు. పిటిషన్ విచారణార్హతపై అభ్యంతరాలు లేవనెత్తారు. ఉపా చట్టం కింద ఎన్ఐఏ కేసు నమోదు చేసిందని 21(4) సెక్షన్ ప్రకారం బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తే దానిపై ధర్మాసనం ముందు అప్పీల్ చేయాల్సిందే తప్ప మరో మార్గం లేదన్నారు. నాగన్న బెయిల్ పిటిషన్‌కు విచారణ అర్హతలేద న్నారు. ధర్మాసనం ముందు అప్పీల్ చేసుకోవాలనే వాదనతో న్యాయమూర్తి ఏకీభవించారు. నాగన్న దాఖలు చేసిన క్రిమినల్ పిటిషన్‌కు విచారణార్హతలేదంటూ కొట్టేశారు. ఎన్ఐఏ సెక్షన్ 21(4) సెక్షన్ ప్రకారం ధర్మాసనం ముందు మాత్రమే అప్పీల్ చేసుకోవాల్సి ఉందని తీర్పునిచ్చారు.

# వైసీపీ ముందస్తు సన్నాహాలా..?

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద సంఖ్యలో జనం ప్లీనరీకి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పినట్లు వైసీసీ వర్గాలు చెబుతున్నాయి. ప్లీనరీ నిర్వహణకు కమిటీల ఏర్పాటు బాధ్యతను ప్రభుత్వ సలహాదారు సజ్జలకు అప్పగించారు. వచ్చే మూడు నాలుగు రోజులలో ప్లీనరీ కమిటీల ఏర్పాటు జరుగుతుందని సజ్జల జగన్ కు చెప్పినట్లు తెలుస్తోంది. వైసీపీ సభలకు జనం రావడం లేదన్న ప్రచారానికి ప్లీనరీతో ఫుల్ స్టాప్ పడేలా జనసమీకరణ ఉండాలని జగన్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్లీనరీతో వైసీపీకి జనంలో అభిమానం చెక్కు చెదరలేదని చాటాలని జగన్ ముఖ్యనేతలకు చెప్పినట్లు పార్టీ వర్గాలు తెలియజేశాయి.

## ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చే విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి: ఆర్.బి.కె.చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, జూన్ 3, ప్రజాపాలన : తక్కువ పెట్టుబడితో, అధిక లాభాలను, రైతులు పొందాలనే లక్ష్యంతో, ప్రభుత్వం వారు విత్తనాలను, 50శాతం రాయితీతో అందజేస్తున్నారని,ఈ సదవకాశాన్ని రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి కోరారు.చీరాల మండలం,కావూరి వారి పాలెం పంచాయతీ కార్యాలయంలోని, ఆర్ బి కె సెంటర్ నందు, గ్రామస్థాయి రైతు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రైతులకు సగం సబ్సిడీ కింద, జీలగ విత్తనాలు మరియు పిల్లి పెసర విత్తనాలు ప్రభుత్వం వారు ఇస్తున్నారని తెలియజేశారు. రాయితీ పై విత్తనాలు, ప్రతి ఆర్ బి కె సెంటర్ నందు లభిస్తాయని, రైతులందరూ ఈ సదవ కాశాన్ని, సద్వినియోగం చేసుకోవాలని, రైతులను కోరారు. రైతులు తెలిపిన పలు సమస్యలను, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ్,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గఇన్చార్జి కరణంవెంకటేష్‌బాబు ల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి, ఏడి సుమతి, ఆర్ బి కే అధికారిణి ఏమేలియా మరియు రైతులు పాల్గొన్నారు.

# స్లో సైక్లింగ్ పోటీలకు విశేషస్పందన




చీరాల, జూన్ 3, ప్రజాపాలన : చీరాల పురపాలక సంఘ పరిధిలో, ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని, (మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్ అండ్ స్పోర్ట్స్ ) నెహ్రూ యువ కేంద్ర – చీరాల వారి ఆధ్వర్యంలో, 5 సంవత్సరాల లోపు బాల బాలికలకు, ఎన్ ఆర్ అండ్ పీఎం హై స్కూల్ ప్రాంగణం నందు, నిర్వహించిన స్లో సైక్లింగ్ కాంపిటేషన్ కు విశేష స్పందన లభించింది. సుమారు 70 మంది బాల, బాలికలు ఈ పోటీ నందు ఉత్సాహంతో పాల్గొన్నారు. అదే విధముగా ఈ పోటీ నందు విజేతలుగా నిలిచిన పిల్లలకు బహుమతులు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారికి, మున్సిపల్ కమీషనర్ సి హెచ్. మల్లేశ్వరరావు,వార్డు కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్ , నెహ్రూ యువ కేంద్ర – చీరాల నిర్వాహకులు విజయ విజేతలకు బహుమతులు అందచే శారు. వేసవి కాలములో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుటకు, ఎన్.జి.ఓ.లు ముందుకు రావటం అభినందనీయమని, విద్యతో పాటు, వివిధ ఆటల పోటీలలో, బాల బాలికలు పాల్గొనటం ద్వారా, వారిలో ఉన్నటువంటి ప్రతిభను గుర్తించడం జరుగుతుందన్నారు. అదే విధముగా ఇటువంటి ఆటల పోటీలు నిర్వహించుట ద్వారా, దేశములోను మరియు రాష్ట్రములోను పేరుప్రఖ్యాతు లు పొందే అవకాశం ఉంటుందని, కమీషనర్ అన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన నెహ్రూ యువ కేంద్ర – చీరాల వారికి అభినందనలు తెలియచేశారు.

## గడపగడపకు కార్యక్రమంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నా: శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు



గోకవరం ప్రజాపాలన ప్రతినిధి :తూర్పుగోదావరి జిల్లా జూన్ 3 గోకవరం మండలం గోపాలపురం లో ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు వైఎస్సార్ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జగ్గంపేట శాసన సభ్యులు జ్యోతుల చంటిబాబు అన్నారు. శుక్రవారం గోపాలపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గడపగడపకు తిరుగుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులు ఆదేశించడం జరిగింది. అనంతరం రైతులకు సబ్సిడీ తో వచ్చిన వ్యవసాయ ట్రాక్టర్ లను గోపాలపురం రైతులకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గోకవరం జడ్పిటిసి దాసరి శ్రీరంగ రమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ జనపరెడ్డి హిమశైలు సుబ్బారావు, ఎంపీపీ సుంకర శ్రీవల్లి వీరబాబు, స్థానిక టిడిపి ఎంపిటిసి గళ్ళ కృష్ణ మండల పార్టీ కన్వీనర్ పాటి రాంబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్, వైస్ ఎంపీపీ మడికి మైనర్ బాబు, నరాలశెట్టి నరసయ్య, మంగరాతి శ్రీను, తోలేటి రాంప్రసాద్, రేలంగి అప్పారావు, తుపాకుల నాగేశ్వరరావు, ఆవుల బంగారమ్మ, పండు, కందేపల్లి రాంబాబు, మరియు అధికారులు, ఎంపీడీవో . కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పై కొరడా ఝుళిపించింది సీఐ కనకారావు బృందం



నందిగామ జూన్3 ప్రజాపాలన ప్రతినిధి: ఇటీవల కా లంలో లో చాలా మంది యువకులు తక్కువ సమ యంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని దురుద్దేశం తో అనేక వక్ర మార్గాలకు పాల్పడుతూ ఉన్నారు ఈ క్రమంలో తెలంగాణ మద్యం తక్కువ రేటు లభిస్తున్న తరుణంలో దానిని ఆంధ్రాలో కి తరలించి సొమ్ము చేసుకునే కార్యక్రమంలో చాలా మంది యువకులు బ లయ్యారు పోలీసులు ఎన్నిసార్లు కౌన్సిలింగ్ ఇస్తున్న ప్పటికీ కొంతమంది వ్యక్తులు వారి ప్రవర్తనను మార్చు కోలేదు అదే క్రమంలో శుక్రవారం ఉదయం కమ్మవారి పాలెం గ్రామానికి చెందిన తలారి బాజీ అనే యువ కుడు తెలంగాణ ప్రాంతమైన మధిర పట్టణం నుండి 80 బాటిల్స్180ఎంఎల్ మద్యాన్ని ఆటోలో నంది గామ తరలించే క్రమంలో పల్లగిరి వద్ద సిఐ కనకారావు సురేష్ మరియు ఇతర సిబ్బంది అతన్ని పట్టుకు న్నారు మద్యం తరలించడానికి ఉపయోగించిన ఆటో నెంబర్ ఏపీ16 టి ఈ10 82 సీజ్ చేసి సంబంధిత సెక్ష న్ల పై కేసు నమోదు చేసి మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా సిఐ కనకారావు మాట్లాడు తూ యువత అక్రమ మార్గంలో పయనించి వద్దని చ ట్టానికి ఎవరూ అతీతులు కారని ఎంతటివారైనా చ ట్టాన్ని అతిక్రమిస్తే శిక్షార్హులు అవుతారని విలువైన జీ వితాన్ని నాశనం చేసుకోవద్దనిహితవు పలికారు.

## వైసీపీ నాయకుల మాటలు కట్టుకథలు



మచిలీపట్నం టౌన్ 3 , 2022 ప్రజాపాలన :వైసీపీ నాయకులు చెపుతున్న మాటలు ఒట్టి కట్టుకథలని ఆర్బిఎస్ మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షుడు పివిఫణికుమార్ విమర్శించారు. శుక్రవారం మచిలీపట్నం పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో జరిపిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత మూడేళ్ళుగా వైసీపీ పాలకులు బ్రాహ్మణ కార్పొరేషన్ను నిర్వీర్యం చేశారన్నారు. బ్రాహ్మణులకు అందవలసిన సంక్షేమ పథకాలు ఏవీ అందడంలేదన్నారు. కార్పొరేషన్ చైర్మన్ గా పనిచేసిన మల్లాది విష్ణు, డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి బ్రాహ్మణులకు చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు హయాంలో బ్రాహ్మణులకు సబ్సిడీ రుణాలు అందించారన్నారు. బ్రాహ్మణ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసివేలాది పేద బ్రాహ్మణులను చంద్రబాబు ఆదుకున్నారన్నారు. ఎన్నికల ముందు బ్రాహ్మణ కార్పొరేషన్కు వెయ్యి కోట్లు ఇస్తామని బ్రాహ్మణులతో ఓట్లు వేయించుకుని వైసీపీ పాలకులు బ్రాహ్మణులకు మొండి చెయ్యి చూపించారన్నారు. జగన్రెడ్డి మెప్పు పొందేందుకు మళ్ళీ రానున్న ఎన్నికల్లో తమ ఎమ్మెల్యే టిక్కెట్లను వైసీపీ లోపదిలపరుచుకునేందుకు బ్రహ్మ గర్జన పేరుతో కొత్త నాటకానికి తెర లేపారన్నారు. బ్రహ్మగర్జన పేరుతోవైసీపీ నాయకులు చేస్తున్న మోసాన్ని రాష్ట్రంలోని బ్రాహ్మణులు గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు బి శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే ఆమంచి



వేటపాలెం, జూన్ 3, ప్రజాపాలన : వేటపాలెం మండలం, అక్కాయపాలెం పంచాయతీ పరిధిలోని, లక్ష్మీపురం గ్రామంలో,దిడ్ల సుజ్ఞాన రావు కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో, చీరాల మాజీ శాసన సభ్యులు ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.తొలుత స్థానిక నాయకులు కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ కు, సాదర స్వాగతం పలికారు. ఈకార్యక్రమములో ఆమంచి తోపాటు, యర్రా శంకర్, అన్నమయ్య, విక్టోరియా, గ్రామ పెద్దలు యువత, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్వర్ పది రోజుల నుండి పనిచేయడం లేదు: పట్టించుకోని సబ్ రిజిస్ట్రార్ అధికారులు

### రెక్టిఫికేషన్ కోసం చలానా కట్టిన వారి ఎదురు చూపులు




చీరాల, జూన్ 3, ప్రజాపాలన : బాపట్ల కొత్త జిల్లాగా ఏర్పడిన కారణంగా, తలెత్తిన సాంకేతిక లోపాల నేపథ్యంలో, గత పది రోజుల నుండి,చీరాల ఎస్.ఆర్.వో, సబ్ రిజిస్ట్రార్ దాని గురించి,మీ సేవ లాగిన్ లో, నాట్ డిస్ప్లేయింగ్ డిస్ట్రిక్ట్ సబ్ రిజిస్టర్ ఆఫీస్.అని చూపుతుంది. .గత పది రోజుల నుండి సర్వర్ అందుబాటులో లేదు. హయ్యర్ అథారిటీ కి సమాచారం అందచేశారు.కానీ రిజిస్టర్ ఆఫీసు కి చలానా కట్టిన వాళ్ళు రెక్టిఫికేషన్ ఎప్పుడా అని ఎదురుచూస్తున్నారు. అధికారులు స్పందిస్తారో..!?,ఎప్పటిలాగే ఆలస్యంగా...,ఆలోచిస్తూనే ఉంటారో..,వేచి చూడాల్సిందే..?!

## శ్రీ అంకమ్మతల్లి కొలుపులలో పాల్గొన్న మాజీఎమ్మెల్యే ఆమంచి



చీరాల, జూన్ 3, ప్రజాపాలన : చీరాల మండలం కావూరివారిపాలెం పంచాయతీ లోని, దేగలవారినగర్ లో శ్రీ అంకమ్మతల్లి కొలుపులు సందర్భముగా,చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్థానిక నాయ కులు, కార్యకర్తలు, మాజీఎమ్మెల్యే ఆమంచికి ఘన స్వాగతం పలికారు. ఆలయకమిటీ వారు మర్యాదపూర్వకంగా, ఆమంచిని సన్మానించారు. ఈకార్యక్రమములో ఆమంచి తోపాటు, చీరాల మండల వైస్సార్సీపీ కన్వీనర్ మేడిబోయిన బలరామిరెడ్డి , మల్లెల శివ, దేగల శ్రీను, సుబ్బా రావు, గ్రామ పెద్దలు యువత పాల్గొన్నారు.

# ఉద్యోగులకు కేంద్రం షాక్..

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగ భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) సభ్యులకు కేంద్రం మరో షాక్ ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సర డిపాజిట్లపై వడ్డీరేటును తగ్గించి వేసింది. ఇంతకుముందు 8.5 శాతంగా ఉన్న వడ్డీరేటును 8.1 శాతానికి కుదిస్తూ కేంద్ర కార్మికశాఖ తీసుకున్న నిర్ణయానికి కేంద్రం ఆమోదం తెలిపింది. కేంద్రం ఆమోదించిన తర్వాత కార్మికశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.దీని ప్రకారం సబ్‌స్క్రైబర్ల ఖాతాల్లో గతేడాది డిపాజిట్లపై వడ్డీరేటును జమ చేసే ప్రక్రియను ఈపీఎఫ్‌వో చేపట్టింది. ఇంతకుముందు ఈపీఎఫ్‌వో 2020–21లో 8.5 శాతం వడ్డీరేటు చెల్లించింది. తాజాగా 8.1 శాతానికి తగ్గించడం నాలుగు దశాబ్దాల కనిష్ట స్థాయితో సమానం. ఇంతకుముందు 1977–78లో ఈపీఎఫ్ వడ్డీరేటు 8 శాతం.గత నాలుగేండ్లలో పలుసార్లు ఈపీఎఫ్‌వోలో సభ్యుల డిపాజిట్లపై వడ్డీరేట్లు తగ్గించేశారు. 2017–18లో 8.55 శాతంగా ఉన్న వడ్డీరేటు 2018–19లో 8.65 శాతానికి 2019–20లో 8.5 శాతానికి మారుస్తూ ఈపీఎఫ్‌వో నిర్ణయం తీసుకున్నది. 2011–12లో ఈపీఎఫ్‌వోలో సభ్యుల డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీరేటు లభించింది.కాగా, గత మార్చిలో 15.32 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు చేరితే, ఫిబ్రవరిలో 12.85 లక్షల మంది జత కలిశారు. ఫిబ్రవరితోతో పోలిస్తే 2.47 లక్షల మంది సభ్యులు మార్చిలో పెరిగారు. మొత్తం ఈపీఎఫ్‌వోలో ఐదు కోట్ల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు.

## మస్కట్ తెదేపా మహానాడు కోసం ఓమన్ చేరుకున్న తెలుగుదేశం నేతల బృందం



ఓమన్ జూన్3 ప్రజాపాలన ప్రతినిధి: తెలుగుదేశం పార్టీ చేపట్టిన మస్కట్ మహానాడు కార్యక్రమంలో భా గంగా తెదేపా నేతలు తంగిరాల సౌమ్య ఆచంట సునీ త తదితర బృందం ఓమన్ చేరుకున్నారు అక్కడికి చేరుకున్న వెంటనే ఎన్.ఆర్.ఐ. లు (తెదేపా నాయకు లు)పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

## బాదుడే బాదుడు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య




వత్సవాయి జూన్ 3 ప్రజా పాలన ప్రతినిధి మండల పరిధిలో కన్నెవీడు గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పా ర్టీ ఆదేశాల మేరకు బాదుడే బాదుడు కార్యక్రమం ని ర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా టీ డీపీ జాతీయ కో శాధికారి మాజీ ఎమ్మెల్యే శ్రీ శ్రీరాం రాజగోపాల్ తా తయ్య పాల్గొన్నారుగ్రామంలో ముం దుగా గ్రామ కమి టీ నిర్వహించిన అనంతరం గ్రామం లో పర్యటించి ప్ర జల సమస్యలు తెలుసుకుని వాటి కి పరిష్కార మా ర్గం చూపించారుఈ సందర్భంలో తాతయ్య మాట్లా డుతూమూడేళ్లలో నిత్యావసరాల ధరలు రెట్టింప య్యాయి కొత్త కొత్త పన్నులు వేస్తూ ప్ర జలను పీల్చిపి ప్పి చేస్తున్నారు. నిత్యావసర వస్తు వుల ధరలు, వి ద్యుత్ ఛార్జీలు, మద్యం రేట్లు, ఇసుక రేట్లు, సిమెంట్ రేట్లు సామాన్య ప్రజలకు అందనం త గా రేట్లు పెంచి సామాన్య ప్రజలను ఒకటే బాదుడు బాదుతు న్నార న్నారు ఈ కార్యక్రమంలో వత్సవాయి మండల తెలు గుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు,క ర్నా టి గౌతమ్ గ్రామ పార్టీ సీనియర్ నా యకులు, కర్నాటి రఘు,దారావత్ నాగ, మరియు టీడీపీ యూత్ సభ్యులు పాల్గొన్నారు

## డిసిపి ప్రశాంతి ఆకస్మిక పర్యటన




నందిగామ జూన్ 3 ప్రజా పాలన ప్రతినిధి ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న తరుణంలో డిస్టిక్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ప్రశాంతి ఆకస్మిక పర్యటన చేశారు ఈ పర్యటనలో బైపాస్ రో డ్డు మరియు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను ఆ మె పరిశీలించారుపలు బ్లాక్ స్పాట్ లను పరిశీ లిం చారుబైపాస్ రోడ్ లో ప్రమాదాలు జర గ కుండా సి మెంట్ డివైడర్ లను ఏర్పాటు చేసి రేడి యం స్టిక్కర్ లను ఏర్పాటు కు కృషిచేసిన డిఎస్పినా గేశ్వర రెడ్డి ని సి ఐ. కనకారావు ను అభినందించారు.

## మంచినీటి సరఫరా ప్రాజెక్టును తనిఖీ చేసిన మున్సి పల్ కమిషనర్ జయరామ్



నందిగామ జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి: ము న్సిపల్ కమిషనర్ జయరామ్ పట్టణంలోని రక్షిత మంచినీటి పథకాన్ని తనిఖీ చేపట్టారు మరియు మంచినీటి సర ఫరా పట్టణమంతా సరైన రీతిలో సరఫరా జరుగు తుందో లేదోనని వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.సరఫరా జరగని కొన్ని ప్రాం తాలకు ట్యాంకర్లను పంపించాలని ఆదేశించారు మ రియు రానున్నది వర్షాకాలం కాబట్టి దోమలు ఎక్కు వగా ప్రబలే అవకాశం ఉన్నందున దోమల నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు: చీఫ్ విప్ ముదునూరి



నరసాపురం, జూన్ 3 (ప్రజాపాలన ప్రతినిధి) : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నరసాపురం మండలం యర్రంశెట్టివారి పాలెం గ్రామంలో ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్న విధానంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థద్వారా పరిపాలనను ప్రతి కుటుంబానికి తీసుకువెళ్ళి సంక్షేమ పథకాలు ప్రజల గడపకు చేర్చామని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రభుత్వం నుంచి ఏదో ఒక విధంగా లబ్ది పొందుతున్నామని ప్రజలు ప్రభుత్వ పథకాల పట్ల సంతృప్తిని కనబరుస్తున్నారని ఆయన అన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజ్, శానిటేషన్, విద్యుత్, నాడు నేడు పాటశాలలు తదితర అంశాలపైన పెద్ద ఎత్తున నిధులు ఖర్చు పెడుతున్నామని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందని అన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల నుంచి వస్తున్న విశేషమైన ఆదరణ చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. అధికారులు సరిగ్గా పట్టించుకోవడం లేదని అన్నా, సమాధానం చెప్పడం లేదని ప్రజలు ఫిర్యాదు చేసినా శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార విధానంలోనే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను కూడా శ్రద్ధగా పరిష్కరించాలని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ పెంద్ర వీరన్న, ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవికుమార్, జడ్పిటిసి బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, గ్రామ సర్పంచ్ యర్రంశెట్టి నాగ ముత్యమాంబ, ఏఎంసీ వైస్ చైర్మన్ యర్రంశెట్టి బాబులు, దొంగ మురళీకృష్ణ, పితాని సత్యనారాయణ, గుబ్బల వెంకటేశ్వరరావు, పప్పుల రామారావు, గుబ్బల సుందరయ్య, తెలగంశెట్టి వాసు, ఆకన ఏసుబాబు, ఆకన వెంకటేశ్వరరావు, గంగిరెడ్డి కిరణ్, చవ్వాకుల నాగేశ్వరరావు, పిట్టా రామారావు, పితాని ఏడుకొండలు, గుబ్బల రామారావు, ఆకన అప్పాజీ, ఎంపీడీవో శివ ప్రసాదయాదవ్, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడ నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్ 03: మైనింగ్ తవ్వకాలను అధికార యంత్రాంగం జోక్యం చేసుకొని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ, గుడివాడ ఆర్ డి ఓ కార్యాలయం ముందు జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమ మైనింగ్ తవ్వకాలకు అడ్డుకోవాలంటూ పార్టీ నాయకులు నినాదాలు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ మైనింగ్ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతుందని, అధికారులు జోక్యం చేసుకొని తవ్వకాలను అడ్డుకోవాలని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు వేమూరి త్రినాథ్, మీరా షరీఫ్, ఇంటూరి గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్ మహేష్ కుమార్ రివ్యూ సమావేశం



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి జూన్ 03: గుడివాడ పురపాలక సంఘం కార్యాలయం లోని స్పెషలాఫీసర్ చాంబర్లో పురపాలక సంఘ అధికార యంత్రాంగం తో జాయింట్ కలెక్టర్ మహేష్ కుమార్ రివ్యూ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను పురపాలక సంఘ అధికార యంత్రాంగం జేసీకు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు నివేదికలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ మహేష్ కుమార్, నిర్లక్ష్యం లేకుండా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా హౌసింగ్ నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా అన్ని విధాల శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ మహేష్ కుమార్ మీడియాకు చెప్పారు. రివ్యూ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, మెప్మా సి ఎం ఎం శ్రీధర్, పలు విభాగాలకు చెందిన పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

## వీరవల్లి రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి



గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి జూన్ 03:పోలీసులు కథనం ప్రకారం బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన నక్కా సాంబశివరావు కుమారుడు నక్కా వెంకటేశ్వరరావు అలియాస్ సాయి వెంకటేష్ (23) హనుమాన్ జంక్షన్ నుంచి ద్విచక్రవాహనం పై సర్వీసు రోడ్డు నుంచి వీరవల్లి వెళ్తున్న సమయంలో ఇండియన్ పెట్రోల్ బంకు సమీపంలో ఏదైనా గుర్తు తెలియని వాహనం, జంతువుని ఢీకొట్టి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్.ఐ అర్ ఎస్.మొబైల్ ఎస్.ఐ సుందరరావు వీరవల్లి ఎస్.ఐ సుబ్రహ్మణ్యం, పోలీసు సిబ్బంది కలిసి ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి గాయపడిన యువకుడుని అంబులెన్స్ లో చిన్నఅవుటపల్లి పిన్నమనేని.ఆసుపత్రికి తరలించారు.చికిత్స పొందుతూ సాయి వెంకటేష్ మృతి చెందాడు. పోస్టుమార్టం. నిమిత్తం గన్నవరం ప్రభుత్వ. ఆసుపత్రి తరలించారు. సాయి వెంకటేష్ కుటుంబం వీరవల్లి తిరుపతమ్మ గుడి సెంటర్ వద్ద సోడాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. చేతికి వచ్చిన కన్నకొడుకు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు.అందరితో సరదగా కలిసి మెలిసి తిరిగే యువకుడు మరణించటంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి . తమ కుమారుడు మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని తల్లి దుర్గా వేడుకుంటుంది. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ వీరాభిమానిగా వైకాపా చురుకైనా కార్యకర్తగా ఉ న్నాడు. ఎమ్మెల్యే వంశీ గ్రామ వైకాపా తరుపున చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గోనేవారు. యువకుడు వెంకటేశ్వరరావు. మృతి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ , యర్రంశెట్టి రామాంజనేయులు , గ్రామ.పార్టీ నాయకులు గూడవల్లి రత్న సుధాకర్ , మాజీ సర్పంచ్ నందమూరి కృష్ణప్రసాద్ అత్మూరి బాలాజీ ,లంక రవీ శ్రీనివాస్ , కలపాల నాని బాబు , తోమ్మంద్రు రమేష్ , కోడేబోయన బాబీ , బొడ్డు జగన్ తో పాటు పలువురు గ్రామ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. పెట్రోల్ బంకు వద్ద రోడ్డు వైపుకి సిసి కెమెరాలు లేవని పోలీసులు చెబుతున్నారు.

## గడప గడపకు మన ప్రభుత్వం



బాపట్ల జిల్లా ప్రజా పాలన ప్రతినిధి :9వ రోజు ఉదయం బాపట్ల టౌన్ లోని 32వ వార్డు లో గ్రామసచివాలయం సిబ్బందితో, వాలంటీర్లతో, ప్రతీ గడపకు వెళ్లి ఈ 3 సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ఇంటి ఇంటికి తిరిగి ప్రజలకు వివరించిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి శ్రీ కోన రఘుపతి .

## నరసింహా స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్ రావు



కంచికచర్ల జూన్3 ప్రజా పాలన ప్రతినిధి: మండల ప రిధిలో లోని పరిటాల గ్రామంలో వీర్ల నరసింహ స్వా మి నిన్న మృతిచెందడంతో ఎమ్మెల్యే డాక్టర్ మొండి తోక జగన్ మోహన్ రావుశుక్రవారం వారి నివాసా నికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారుఅ నంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో స్థానిక వై యస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు .

## కంచర్ల చార్లెస్ ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు



పెనుగంచిప్రోలు జూన్ 3 ప్రజా పాలన ప్రతి నిధి: మం డల పరిధిలో నవా బుపేట గ్రా మంలోని ఆర్. సి.ఎమ్. చర్చి నందు కంచర్ల చార్లెస్ ప్రధమ వర్ధంతి కార్యక్ర మంలోఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొని,ఆయన చిత్రపటానికిపూలమాలలు వేసి నివాళు లు అర్పించారు ఈ కార్యక్రమంలో స్థాని క వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?
ప్రశ్న మాది - లక్ష మీది

నేటికీ సమాజంలో గౌతమ బుద్ధ , జ్యోతిరావు పూలే, డాక్టర్ అంబేడ్కర్, బాబు జగజీవన్ రామ్, బీ పీ మండల్ , షేక్ ఫాతిమా, సురవరం ప్రతాపరెడ్డి , త్రిపురనేని రామస్వామి చౌదరి , రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలగువారు అంటే ఎవరో అని తెలియని వాళ్ళు ఉన్నారు. ఈ మధ్య కాలంలో కొందరు రాజకీయ నాయకులు బహుజన మహనీయుల చిత్రపటాలను చూసి ఎవరు వీళ్ళు అని ప్రశ్నించిన సందర్భాలు నెలకొన్నాయి.

మన బహుజన సామాజిక స్ఫూర్తిదాతల చరిత్ర, ఉద్యమ స్ఫూర్తి మరుగున పడిపోవడంవల్ల భావితరాలకు స్ఫూర్తి మరియు దేశాభివృద్ధిలో పురోగతి ఉండదు. అందువల్ల అన్ని కులాలలోని మహానుభావుల చరిత్రను ప్రపంచానికి తెలియచెప్పాలనే ఉద్దేశంతో పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో మాస్టర్ కీ టీవీ (అంబేడ్కర్ టీవీ) ఛానల్ లో

"మీలో ఎవరు లెజెండ్ బహుజన్ ?"
ప్రశ్న మాది - లక్ష మీది

అనే ఒక సరికొత్త ప్రోగ్రాం ను ప్రారంభించబోతున్నాం.

ఈ కార్యక్రమానికి నాంది పలుకుతూ స్పాన్సర్ చేసిన వారి వివరములు :

12.పర్లపల్లి చారిటబుల్ ట్రస్ట్ Rs 5000/-

13.ఓగూరి నాగేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్, Rs 5000/-

14.కుసుమ కమల రత్నం మెమోరియల్ ట్రస్ట్ Rs 2000/-

15. రత్నశ్రీ పార్క్స్ ఏపీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ Rs 2000/-

స్పాన్సర్ చేసిన వారికి ధన్యవాదములు

ఈ ప్రోగ్రాంకు స్పాన్సర్ చేయదలిచిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు

మా అకౌంట్ వివరాలు :

Cell No. 9154958315

మీరు Sponsorship amount ను Jai B Bhoomi News Channel Limited - A/c. No: 38072051879 , IFSC : SBIN0005893, State Bank of India,Bazarghat Branch,Hyderabad
అకౌంట్ కు పంపించిన కౌంటర్ ఫైల్ తో పాటు మీ వివరాలు పోస్ట్ ద్వారా లేక masterkeytv234@gmail.com ఈ మెయిల్ కు పంపించగలరు.

# ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 04, జూన్ 2022


## హక్కులను హరించే నూతన విద్యా విధానం

మనరాజ్యాంగంలో విద్యా హక్కును పొందుపరిచారు. నూతన విద్యా విధానం (ఎన్ఈపి) అమలుతో విద్యా హక్కును కూడా కోల్పోయే ప్రమాదం ముంచుకొచ్చింది. ఈ విధానం బాలల పాలిట శాపం కానున్నది. పాఠశాలల విలీనం, మూసివేత, సుదూర ప్రాంతాల నుంచి బడులకు వెళ్లవలసిన పరిస్థితులు రానున్నాయి. డ్రాపవుట్స్ రేటు గణనీయంగా పెరిగే ప్రమాదం ఉంది. శ్రమకు విలువ లేని శ్రామికులుగా బాలికలు మారుతారు. నిరక్షరాస్యత ఇంకా పెరిగి, సమాజ చైతన్య స్థాయి దిగజారే ప్రమాదం ఉంది.రాజ్యాంగపరమైన బాలల హక్కులు కనుమరుగవబోతున్నాయి. బాలికల విద్యపై ఎన్ఈపి ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే రాజ్యాంగం కల్పించిన మానవ హక్కులకు తిలోదకాలు ఇవ్వడమే.అనేక మంది సంఘసంస్కర్తల పోరాటాల ప్రభావం వలన బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలలో మహిళలు పాల్గొని మహిళా శక్తిని నిరూపించారు. అసమానమైన తెగువ చూపించారు. ఆయా దేశాలలో అణచివేయబడుతున్న మహిళలకు సమానహక్కులు కల్పించాలని చేసిన ఉద్యమాల ఫలితంగా ఆయా దేశాల రాజ్యాంగాలు మానవ హక్కులకు రాజ్యాంగబద్ధత కల్పించాయి. ఇందులో కీలకమైనది విద్యాహక్కు. విద్యాహక్కు కల్పించిన అనేక అవకాశాలను స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈనాటి వరకు మన దేశ పరిస్థితులకు అనుగుణంగా అమలవుతోంది. సుదీర్ఘకాలం చేసిన పోరాటాల ఫలితంగా 2009లో విద్యాహక్కు చట్టం అమలులోనికి వచ్చింది. ప్రగతికి సూచికగా గల విద్యాహక్కు చట్టాలను నిర్వీర్యం చేసే ప్రధానదాడి నూతన విద్యావిధానంలో ఉంది. అంటే ఆయా రాష్ట్రాల విద్యా హక్కులపై కేంద్రం దాడి అని చెప్పవచ్చు. రాష్ట్రాల పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్రాలలో మార్పులను చేసుకునే హక్కులను కోల్పోయినట్లే. సిలబస్‌లు కావచ్చు. పరీక్షల విధానం కావచ్చు, శిక్షణా కార్యక్రమాలు కావచ్చు, బడ్జెట్లు కావచ్చు. ఇవన్నీ ఎన్ఈపి ద్వారా కేంద్రం అధీనంలోకి వస్తాయి. అంటే రాష్ట్రాల స్వతంత్రతను దెబ్బతీస్తూ కేంద్రం పెత్తనం పెరగనుంది.అంటే ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమైనది. దీని ప్రభావం బాలలపైన, సమాజంపైన ఉంటుంది. రాజ్యాంగపరమైన హక్కులు అమలు జరగాలంటే విద్యే కీలకం, విద్య అందరికి అందుబాటులో ఉంటేనే సాధ్యమవుతుంది. అటువంటి విద్యను, విద్యాసంస్థలను ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి దాకా కేంద్రీకరణ చేసే సంస్కరణ ఎన్ఈపిలో ఉంది. కనుకనే ప్రాథమిక విద్యావ్యవస్థలోని 3, 4, 5 తరగతులను హైస్కూలులో విలీనం చేయడం, హైస్కూల్సులో ఒకే మీడియం అమలు చేయాలని, సిబిఎస్ఇ సిలబస్‌ను ప్రవేశపెట్టడం, ధార్మిక సంస్థల ప్రవేశానికి అనుమతించడం. ఉపాధ్యాయ శిక్షణల కాలపరిమితి పెంచడం వంటి అంశాలన్నీ బాలలను చదువుకు దూరం చేసేవిగా, యువతకు నిరుద్యోగం పెంచేవిగా, సమైక్యతను దెబ్బతీసేవిగా, మాతృభాషల రక్షణ లేకుండా చేసేవిగా ఉన్నాయి. ఇది విద్యాహక్కుకు దూరం చేయడం రాజ్యాంగ విరుద్ధం.భారతదేశపు మహిళలు ఇప్పుడు విద్య, సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాలు, ప్రసార మాధ్యమాలు, కళా సాంస్కృతిక కార్యకలాపాలన్నింటిలో చురుగ్గా ఉన్నారు అంటే అది విద్య కారణంగానే. మహిళలు వివక్షకు గురికాకుండా ఉండాలన్నా, అన్నింటిలో సమానత్వం సాధించాలన్నా రాజ్యాంగంలో నిబంధన 15(1), నిబంధన 14ల ద్వారా కల్పించబడ్డాయి. ఎన్ఈపిలో ఈ నిబంధనలకు విరుద్ధంగా విద్యలో వివక్షత, అంతరాలు పెరగనున్నాయి. న్యాయపరమైన, మానవోచిత పరిస్థితుల రక్షణ రాజ్యాంగం ఇచ్చినపుడు, విద్య వాటి చైతన్యానికి దోహదపడుతుంది. బాలికలపై, మహిళలపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలన్నా విద్యతో చైతన్యవంతులు కావాలి. అటువంటి విద్యే దూరమైతే... ఇటువంటి మచ్చుతునకలు చాలా ఉన్నాయి. విద్యవలన చైతన్యం చైతన్యం వలన మార్పులు సాధనవంటి అనేక అంశాలు ముందుకు వచ్చినపుడు రాజ్యాంగ హక్కులు రక్షించబడతాయి.ఇప్పటికే సమాజంలో అనేక సమస్యలు తాండవిస్తుంటే, మరిన్ని సమస్యలు పెరిగేందుకే ఎన్ఈపి దోహదపడుతుంది. అక్షరాస్యత, విద్య వ్యాసంగాలు పరిపూర్ణంగా సమాజంలో ఆడ శిశువుల హత్యలు, లింగవివక్షత, స్త్రీల ఆరోగ్యం ఉపాధులు కొంత మెరుగుదలలో ఉన్నాయని యునిసెఫ్ రిపోర్టులు తెలియచేస్తున్నాయి. ఎన్ఈపి అమలు చేస్తే ఇటువంటివన్నీ పెరిగిపోతాయి. ఒకప్పటి సాంఘిక దురాచారాలు మళ్లీ ప్రబలుతాయి. విద్యకు దూరమయ్యే బాలిక, మహిళ తరతరాలుగా సామాజిక అంతరాలను చవిచూడాల్సివస్తుంది.దేశంలో ఏ అంశం మీద అయినా మాట్లాడే హక్కు, భావ ప్రకటన చేసే హక్కు ప్రాథమిక రాజ్యాంగ హక్కులు కల్పించబడినా వాటిపై కూడా దాడి పెరుగుతుంది. ఈ విధానాన్ని ప్రవేశపెట్టే ముందు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసింది. అంతే కాక బిజెపి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఢిల్లీ, పాండిచ్చేరి, పంజాబ్, బిహార్, మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, జాదవ్‌పూర్ లాంటి విశ్వవిద్యాలయాల్లో ఇటువంటి విద్యావిధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసే మిలిటెంట్ ఆందోళనలను, ప్రశ్నించే హక్కులను అణచివేయడం, ఎస్మావంటి చట్టాలను ప్రయోగించడం చేసింది. విద్య కాషాయీకరణ, మతోన్మాద ధోరణులు పెచ్చరిల్లుతున్న క్రమంలో నూతన విద్యావిధానం మరింత హీన సంస్కృతిని పెంచుతుంది.ఎన్ఈపిని ఎందుకు వ్యతిరేకించాలి? విద్యపట్ల సమగ్ర దృక్పథం కేంద్ర ప్రభుత్వానికి లేదు. విద్యాహక్కు చట్టంలో పిల్లలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అంగన్‌వాడీలు మొత్తం భాగస్వాములుగా ఉండాలనే అంశాన్ని ఎన్ఈపిలో అంగీకరించడంలేదు. స్పష్టతలేదు. నిధుల కేటాయింపులు ఈ విధంగా చేస్తామని గాని, భవిష్యత్‌కు ఇంత అవసరమనిగాని చెప్పలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీ గురించి.. ఉపాధ్యాయులకు నాణ్యమైన శిక్షణ గురించి సమగ్ర ప్రస్తావనలేదు. వాలంటీర్ల వ్యవస్థలను ధార్మిక సంస్థలు, ఎన్జీఓ గ్రూపులు వంటి వాటిని స్కూలు కాంప్లెక్సుల పరిధిలో జోక్యానికి అవకాశం ఇచ్చింది. స్వచ్ఛందంగా వారితో పాఠాలు చెప్పించుకోవచ్చు అని తెలియచేసింది. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో కొనసాగుతున్న బోధన ఎన్ఈపి వలన, వారి జోక్యం వలన మతతత్వధోరణులు, వారు ఏ భావజాలాన్ని చెప్పదలుచుకుంటే వాటిని చొప్పించే పని జరుగబోతుంది. దీనివలన అందరికీ విద్య, సామాజిక న్యాయం, రాజ్యాంగ స్ఫూర్తి, భిన్నత్వంలో ఏకత్వం వంటి రాజ్యాంగ హక్కులకు విఘాతం కలుగబోతుంది. అందరికీ అందుబాటులో నాణ్యమైన విద్య, సామాజిక న్యాయం లక్ష్యంగా ఉన్న ఫెడరల్ విద్యావ్యవస్థ ప్రమాదంలో పడనుంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉమ్మడి జాబితాలో గల విద్యపై అధికారం చెలాయిస్తూ రాష్ట్రాల భాగస్వామ్యాన్ని కాలరాస్తోంది.రాజ్యంగ విలువలైన ప్రజాస్వామ్యం, సమానత్వం, లౌకికవాదం, సాంస్కృతిక భాషావైవిధ్యం వంటివి వ్యాప్తి చేయడం చాలా ముఖ్యం. అయితే ఎన్ఈపిలో ఇంత విలువైన రాజ్యాంగ లక్ష్యాలు తుంగలో తొక్కబడుతున్నాయి. విద్యా హక్కు చట్టంలో అంగన్‌వాడీ వ్యవస్థ నుంచి పిజి వరకు (ఉన్నత విద్యా రంగం) ఆ హక్కు పరిధిలోనికి తేవాలి. ప్రభుత్వ పాఠశాలల విలీనాన్ని, మూసివేతలను ఆపాలి. రాజ్యాంగం సూచించిన రిజర్వేషన్లను అమలు చేయాలి. విద్యారంగం కాషాయీకరించే చర్యలను మానుకుని లౌకిక విలువలను కాపాడే విధంగా ఉండాలి. ఎన్ఈపి అమలు జరిగితే అణగారిన పేద, మధ్య తరగతి సెక్షన్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రజల మధ్య అంతరాలను విద్య నిర్మూలించాలనే మహాత్ముడు, అంబేడ్కర్ నొక్కి చెప్పారు. మన రాజ్యాంగమూ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. ఆర్థిక అవకాశాలను అందరికీ సృష్టించాలని, ప్రజల మధ్య చీలికలను నివారించాలని, మేధోపరమైన, సాంస్కృతిక అభివృద్ధి జరగాలని, వివక్షతలు, అసమానతలు విద్య ద్వారానే అంతం కావాలని విశాలమైన దృక్పథంతో రాసిన రాజ్యాంగానికే ప్రమాదం తెచ్చే ఎన్ఈపిని అందుకే అనేక మంది వ్యతిరేకిస్తున్నారు. వివక్షను పెంచే నూతన విద్యా విధానంతో సమాజంలో అంతరాలు ఎలా అంతరిస్తాయనేది ఒక పెద్ద ప్రశ్న. అనేక జాతులు మతాలు, కులాలు, భాషలు కలిగిన మన దేశంలో ఫెడరల్ రాజ్యాంగ వ్యవస్థ జాతి సమైక్యతను కాపాడుతోంది. ఎన్ఈపి వీటన్నింటికి భిన్నంగా ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజావ్యతిరేక విధానమైన ఎన్ఈపిని తిప్పికొట్టాలంటే ప్రజలలోనికి, అన్ని వర్గాలలోనికి విస్తృత ప్రచారానికి పూనుకోవాలి. దానికోసం ఒక ఐక్యవేదిక అవసరం, అనివార్యం. ఎన్ఈపికి వ్యతిరేకంగా పోరాడటమే రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే. పోరాటాలే ఇందుకు సరైన మార్గం.

# సమాఖ్య స్ఫూర్తి కొరవడిన మోదీ పాలన

కార్యదక్షుడు ఎక్కడైనా రాణిస్తాడు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విషయంలో ఇది పరిపూర్ణ సత్యం. గుజరాత్ ఆత్మ బంధువుగానూ, భారత భాగ్య విధాతగానూ ఆయన గౌరవ మన్ననలు పొందారు. 2014లో తొలిసారి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడు మోదీ సాధించిన విజయాలలో ఆ విశేష ప్రజాదరణ ఆశ్చర్యకరమైనది. ఎందుకంటే గాంధీనగర్ నుంచి న్యూఢిల్లీకి ఆయన పరివర్తనా ప్రస్థానం చాల సాఫీగా, సమస్యారహితంగా జరిగింది మరి. ముఖ్యమంత్రి పీఠం నుంచి నేరుగా ప్రధానమంత్రి గద్దె నెక్కిన ప్రధానమంత్రులలో నరేంద్ర మోదీ ద్వితీయుడు (ప్రథముడు కన్నడ దేవెగౌడ) అన్న విషయాన్ని మనం మరచిపోకూడదు. అద్భుతమైన ఈ అధికార ప్రాభవం ఆయన రాజనీతిజ్ఞతను కొత్త పుంతలు తొక్కించింది. 'సహకార సమాఖ్య విధానమే' తన పాలనా మంత్రమని మోదీ తీవ్ర భావావేశంతో ప్రకటించారు. దేశ ప్రజలలో ఒక కొత్త ఆశాభావం అంకురించింది. కేంద్ర రాష్ట్ర సంబంధాలలో ఒక కొత్త అధ్యాయాన్ని ఆయన ప్రారంభిస్తారని అందరూ భావించారు. అనుకున్నదే జరుగుతుందా? ఆ సహకార సమాఖ్య పాలనా పద్ధతిపై మోదీ హామీ ఇచ్చిన ఎనిమిది సంవత్సరాల అనంతరం ఇప్పుడు నడుస్తున్న చరిత్ర క్రూర పాదఘట్టనల కింద నలిగిపోతోంది. కక్ష సాధింపు రాజకీయాలలో చిక్కుకున్నది. పరస్పర నిందలు మోపుకోవడంలో మునిగిపోయింది. సంపూర్ణ అధికార దురహంకారంతో అణగిపోయింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య భాషాపరమైన వివాదం లేదా పోరాటానికి ఒక నిర్దిష్ట చరిత్ర ఉంది. అది క్రమ రహితమైనది కావచ్చుగానీ దేశ సమున్నత వైవిధ్యాన్ని అది ప్రతిబింబిస్తోంది. హిందీని జాతీయ భాషగా తమపై రుద్దడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయకూడదని దక్షిణాది రాష్ట్రాలు ఏనాటినుంచో స్పష్టం చేస్తూ వస్తున్నాయి. ఏది ఏమైనా భాషలపై 'యుద్ధం' పునర్జ్వలనమయింది.. ఇది, కొత్తగా ప్రభవిస్తోన్న రాజకీయ వివాదాలను సూచిస్తోంది. నరేంద్ర మోదీ అసాధారణ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీని హిందీ భాషా ప్రాంతాల పార్టీగానే దేశ ప్రజలలో అత్యధికులు ఇప్పటికీ భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలలో హిందీ రాష్ట్రాలే కీలక పాత్ర పోషిస్తున్నాయని హిందీయేతర రాష్ట్రాల ప్రజలు విశ్వసిస్తున్నారు. తనపై ఉన్న 'హిందీ హిందు హిందుస్థాన్' పార్టీ ముద్ర నుంచి బయటపడేందుకు బీజేపీ శతథా ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ వింధ్య పర్వతాలకు దక్షిణంగా ఉన్న ప్రజలు మాత్రం ఉత్తర భారతావని రాజకీయ విలువలకే బీజేపీ నిబద్ధమయి ఉందని విశ్వసిస్తున్నారు. ఆర్థికాభివృద్ధి సాధనలో అగ్రగామిగా ఉన్న తమిళనాడు తమ ప్రాంతీయ విలక్షణ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు కృతనిశ్చయంతో ఉంది. సంఘ్ పరివార్ 'హిందూత్వ భావజాలాన్ని అధికార డిఎంకె అంగీకరించడం లేదు.అయితే ప్రస్తుత వివాదం ఇంకెంత మాత్రం ఉత్తరాది వెర్సెస్ దక్షిణాది పోరాటం ఎంత మాత్రం కాదు. ఇది కేంద్ర–రాష్ట్ర సంబంధాలకు చెందిన సమస్య. సమస్య అనడం కంటే




సంక్షోభం అని అనడమే మేలు. పన్నుల రాబడిని ఆమోదయోగ్యంగా పంచుకునేందుకు దోహదం చేసే సూత్రమేమిటి? ఇంకా పాలనాపరమైన నిబంధనలు, నియంత్రణలు మొదలైనవి ఎన్నో ఆ వివాదాన్ని మరింతగా ప్రభావితం చేస్తున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఇంధన ధరలపై పన్నును తగ్గిస్తూ వ్యాట్ మొదలైన పన్నులు తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అయితే పలు రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్ర ఆర్థికమంత్రి విజ్ఞప్తిని ఉపేక్షించాయి. పన్నుల వ్యవస్థ విషయంలో కేంద్రం 'సలహాల' రూపేణా బహిరంగంగా సలహాలు ఇవ్వడమనేది రాష్ట్ర ప్రభుత్వాలకు మింగుడుపడడం లేదు. పన్నుల విషయంలో కేంద్రం తమను ఇలా నిర్దేశించడమేమిటి అని రాష్ట్రాలు ప్రశ్నిస్తున్నాయి. వస్తుసేవల పన్ను (జీఎస్టీ)తో ఇప్పటికీ తాము అనేక సమస్యలతో సతమతమవుతున్నామని రాష్ట్రాలు వాపోతున్నాయి. తమ ఆర్థిక స్వతంత్ర ప్రతిపత్తిని తగ్గించివేసి, పన్నుల వసూళ్లపై తమ రాజ్యాంగ హక్కులను కేంద్రం హరించివేస్తోందని రాష్ట్రాలు దుయ్యబడుతున్నాయి. అనేక విధాల ప్రతిబంధకంగా ఉన్న పన్నుల వ్యవస్థను సంస్కరించేందుకే జీఎస్టీని ప్రవేశపెట్టారు. అయితే ఈ కొత్త పన్నుల వ్యవస్థ సహకార సమాఖ్య స్ఫూర్తికి ఏమాత్రం అనుగుణంగా లేదని రాష్ట్రాలు విమర్శిస్తున్నాయి. జీఎస్టీ మూలంగా తరచు తమకు ఆదాయ లోటు ఏర్పడి కేంద్రం వితరణపై ఆధారపడవలసి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వాలు విమర్శిస్తున్నాయి. కేంద్ర– రాష్ట్ర సంబంధాలలోని ప్రస్తుత వైషమ్యాన్ని మరొక అంశం మరింతగా తీవ్రతరం చేస్తోంది. అది, బీజేపీ వెర్సెస్ బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలకు సంబంధించినది. ఎన్నికల ప్రచారంలో బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలే ఇతోధిక పురోగతిని సాధిస్తున్నాయని ప్రధానమంత్రి తరచు నొక్కి చెప్పడం తమ పట్ల వివక్ష చూపడమేనని ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలు నిరసిస్తున్నాయి. ఈ నిరసనలో నిజం లేకపోలేదు. ఎందుకంటే ఆ వివక్షా వైఖరి కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం కావడం లేదు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో పెట్రోలియం ఉత్పత్తుల ధరలు తగ్గించడంలో ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలు విఫలమయ్యాయని ప్రధానమంత్రి స్వయంగా విమర్శించారు. ఇది 'మనము', 'వారు' అనే తేడాను చూపడం మినహా మరేమీ కాదు కదా.మోదీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరి వివిధ రాజకీయ పక్షాలను, రాష్ట్ర ప్రభుత్వాలను వ్యాకులపరుస్తోంది. కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరుస్తున్నారనే ఆరోపణలు పెరిగిపోతున్నాయి. ఉన్నతాధికారుల బదిలీలు, నియామకాలపై వివాదాలు, ఘర్షణలు సరేసరి. బెంగాల్ ఇందుకొక తిరుగులేని ఉదాహరణ. ఆ రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రితో నిత్యం ఏదో ఒక విషయమై కలహిస్తున్నారు. రాజ్యాంగ బద్ధమైన అధికారాల విభజన సూత్రాన్ని ఎవరూ గౌరవించడం లేదు. బెంగాల్ ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రతించకుండానే కేంద్రానికి బదిలీ చేసింది. ప్రధానమంత్రి నేతృత్వంలో జరిగిన తుపాను సహాయ కార్యకలాపాల సమీక్షా సమావేశానికి ఆయన హాజరు కాకపోవడంపై నెలకొన్న వివాదంలో ఈ రాజ్యాంగ విరుద్ధ చర్యను మోదీ ప్రభుత్వం చేపట్టింది. ఢిల్లీలో సైతం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కేంద్రం ఎంతగా అదుపు చేయాలో అంతగా అదుపు చేస్తోంది. ఢిల్లీకి సంబంధించిన విధాన నిర్ణయాలలోనూ, కీలక నియామకాలలోనూ కేజ్రీవాల్ ప్రభుత్వ అభిప్రాయాలను ఎంత మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్షాల పాలనలో ఉన్న రాష్ట్రాలలో చురుగ్గా వ్యవహరిస్తూ, బీజేపీ పాలిత రాష్ట్రాలలో మందకొడిగా ఉంటున్నాయి. ఇది ఉద్దేశపూర్వకంగా జరుగుతుండడంతో కేంద్రం, రాష్ట్రాల మధ్య విశ్వాసలోటు మరింతగా విస్తృతమవుతోంది. ప్రతి విపక్షాలకు చెందిన ప్రతీ ముఖ్యమంత్రి, ఆయన సన్నిహిత సహచరులు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నిఘాలో ఉంటున్నారు. తాజాగా జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్‌పై కూడా ఈ నిఘా ప్రారంభమయింది. దీంతో అనుమానాలు, ప్రాతికూల్య ధోరణులు పెరిగిపోతున్నాయి. ప్రతిపక్షాల ప్రభుత్వాలలో ఉన్నవారే కపటవర్తనులూ, అవినీతిపరులా? బీజేపీ ప్రభుత్వాలలో ఉన్నవారు అందరూ నీతీ నిజాయితీలతో వ్యవహరిస్తున్నవారేనా? ప్రతిపక్షాలు వేస్తున్న ఈ ప్రశ్నలకు మోదీ సర్కార్ సమాధానమివ్వడం లేదు. పైగా రాజకీయ కక్ష సాధింపు వైఖరితో వ్యహరిస్తున్నారన్న విపక్షాల ఆరోపణను కేంద్రం కొట్టివేస్తోంది.సర్వాధికారాలు చెలాయిస్తోన్న సర్వాధినేత నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గర్వాతిశయంతో వ్యవహరిస్తోంది. పైగా అక్కడా ఇక్కడా దేశవ్యాప్తంగా ఎన్నికలలో విజయాలతో రాజ్యాంగ పరిధిని మించి రాష్ట్రాల పాలనా వ్యవహారాలను సైతం నిర్దేశించేందుకు సాహసిస్తోంది! పర్యవసానమేమిటో మరి చెప్పాలా? సంస్థలు, వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. కేంద్ర %--%రాష్ట్ర సంబంధాలలో పెరుగుతోన్న అసౌష్ఠవంతో పాలనా వ్యవస్థలు, ప్రజాస్వామిక సంస్థలకు సంభవిస్తోన్న నష్టం అపరిమితమైనది. భారత్ లాంటి బలిష్ఠ బహుళ%--%పార్టీ ప్రజాస్వామ్యం ఎన్నికైన ఏకపార్టీ, ఏకైక నాయకుని నిరంకుశపాలనగా క్షీణించిపోకూడదు. సంప్రదింపుల ప్రక్రియలను పాటించకుండా కీలక నిర్ణయాలు తీసుకునే అధినేతకు ప్రజల బాగోగులపై శ్రద్ధ ఉంటుందా? ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు చేపట్టిన కొద్దికాలానికే ప్రణాళికా సంఘాన్ని నరేంద్ర మోదీ శాశ్వతంగా మూసివేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రణాళికా సంఘం నుంచి తాను ఎదుర్కొన్న వ్యతిరేకత, ఆటంకాలే మోదీని ఆ చర్యకు పురిగొల్పాయని చెప్పడం సత్యదూరమేమీ కాదు. అందరూ అలానే భావించారు మరి. ద్వాదశ సంవత్సరాలకు పైగా గుజరాత్ ముఖ్యమంత్రిగా గుజరాత్‌ను పాలించిన నరేంద్ర మోదీ, ప్రజల చేత ఎన్నికోబడని ఢిల్లీ బ్యూరాక్రాట్లు, ప్రజల మద్దతుతో 'ఎన్నికైన నాయకులకు' ప్రతి వ్యవహారంలోనూ షరతులు నిర్దేశించడాన్ని ఆయన హర్షించలేకపోయారు. మరి నేడు, సరిగ్గా అటువంటి కేంద్రీకృత పరిపాలనా ధోరణులనే మోదీ పాలనా నమూనా ప్రోత్సహిస్తోంది! గుజరాత్ ముఖ్యమంత్రిగా ఏ నిరంకుశ పోకడలను మోదీ నిరసించారో నేడు అవే పద్ధతులను ఆయన అనుసరిస్తున్నారు! మన సమాఖ్య పాలనా విధానం కథ మళ్లీ మొదటికొచ్చింది. తాజా కలం: నిత్య కదన కుతూహలశీలి మమతా బెనర్జీ, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఇప్పుడు స్ఫూర్తిదాయకంగా ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్ భాగ్యనగరంలో లేకుండా బెంగళూరు వెళ్ళారు! 'ఆ ఒక్క కుటుంబం కోసమేనా బలిదానాలు' అని ప్రశ్నిస్తూ తెలంగాణలో కుటుంబ పాలనను కేసీఆర్ ప్రోత్సహిస్తున్నారని ఆ సందర్భంగా మోదీ ఆరోపించారు. గత ఏప్రిల్‌లో ముంబైలో ప్రధానమంత్రి పాల్గొన్న తొలి లతా మంగేష్కర్ పురస్కార ప్రదాన సభకు ఒకనాటి మిత్రపక్ష అధినేత, ప్రస్తుత మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే హాజరుకాలేదు. ఏమిటీ విభేదాలు? ఎందుకీ కలహాలు? ఎంతైనా కలవరం కలిగిస్తున్నాయి. మన సమున్నత రాజ్యాంగ నిర్మాతలు ఔదలదాల్చిన 'సహకార సమాఖ్య వాదం' ఇప్పుడు ద్వేషపూరిత పోటీవాదం, ఆత్మ వినాశక రాజకీయాలలో చిక్కుకున్నది.

## ముందడుగు

జాగ్రత్త చెల్లీ !
కొందరి కడుపులో
కామపు నాగులు
పడుకుని ఉంటాయి

వారి చూపులో తేడా
వారి మాటలో తేడా
వారి నవ్వులో తేడా
వారి కరచాలనంలో తేడా

ఎక్కడ మాటు వేస్తారో
ఎప్పుడు కాటు వేస్తారో
ఎలా వేటు వేస్తారో
ఎప్పుడు రూటు మారుస్తారో

జాగ్రత్త తల్లీ!
రెండు కళ్ళతో కాదు
ఒళ్ళంతా కళ్ళు చేసుకుని
ముందడుగు వెరు ...

కామపు నాగులు
బుసకొట్టే లోపే
వాటి కోరలు విరిగి
తోకలు ముడిచి
దేహం సచ్చుపడేలా
కొత్త సూది మందేదైనా
కనిపెట్టేసేరు ....

...ల



# పేదల ఇళ్లను కూల్చవద్దు.. నేతల ఆక్రమిత కట్టడాలను కూల్చండి..

**ఆర్డిఓ కార్యాలయం వద్ద సిపిఐ ఆందోళన..లో సిపిఐ జిల్లా కార్యదర్శి జి ఈశ్వరయ్య..**



కడప, ప్రజాపాలన ప్రతినిధి : నగరంలో రెవిన్యూ, కార్పొరేషన్ అధికార యంత్రాంగం పేదల ఇళ్లపై ప్రతాపం చూపుతూ పెద్దల ఆక్రమిత కట్టడాల జోలికి ఎందుకు వెళ్లడం లేదంటూ సిపిఐ జిల్లా కార్యదర్శి జి. ఈశ్వరయ్య ప్రశ్నించారు. అధికార పార్టీ నేతల అక్రమ కట్టడాలను వదిలేసి పేదల ఇళ్లను మాత్రమే కూల్చి వేసే చర్యలను నిరసిస్తూ సిపిఐ నగర సమితి నేతృత్వంలో బాధిత ప్రజానీకం ఆర్డిఓ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. తొలుత ఆర్డీవో కార్యాలయం గేటు వద్ద బైటాయించి అనంతరం కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కడప నగరం జలమయం కావడానికి ఎన్టీఆర్ నగర్ మొదలుకొని ప్రకాష్ నగర్, ఎస్ టి కాలనీ, జయమ్మ కాలనీ, రామాంజనేయపురం, తదితర అనేక పేదలు నివాసం ఉంటున్న కాలనీలే కారణమన్నట్లు, కాలువల ఆక్రమణలో ఉన్నాయని గత 15 రోజులుగా పేద ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ జెసిబిలు తీసుకొని పోలీసు యంత్రాంగంతో ఇల్లులు కూల్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టడం దారుణమన్నారు. కడప కార్పొరేషన్ రెవిన్యూ అధికారులు అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్న కట్టడాలకు జోలికి మాత్రం వెళ్లకుండా పేదల ఇళ్లను కూల్చే ప్రక్రియ మాత్రమే చేపట్టడం వివక్షపూరిత నేరమన్నారు. ప్రభుత్వ భూములు, కాలవలు, వంకలు, చెరువులు నేతలు ఆక్రమించుకుని థియేటర్లు, భవనాలు, టౌన్ షిప్ లు, లేఔట్లు నిర్మాణాలు చేపట్టిన వారి దరిదాపుల్లో కూడా పోకుండా పేద ప్రజానీకం పై అధికార దర్పంతో విరుచుకుపడుతుండటం దుర్మార్గమన్నారు. బ్రతకడం కోసం 30,40 ఏళ్ల గా కాలువల పోరంబోకు స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని ఆనాడు ఉన్నటువంటి తాహాసిల్దార్ల తో పట్టాలు ఇప్పించుకుని స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకొని కార్పొరేషన్ పన్నులు, కరెంట్ బిల్లులు కట్టుతూ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నప్పటికి అవిప్పుడు చెల్లవు తక్షణమే ఇళు ్లలు ఖాళీ చేసి వెళ్లాలంటూ తహసిల్దార్ శివరామిరెడ్డి హుకుం జారీ చేస్తుండడం దారుణమన్నారు. కూల్చిన ఇళ్లకు నష్టపరిహారం లేదు పునరావాసం లేదని మండిపడ్డారు. అప్సర థియేటర్ దగ్గర కాల్వల ఆక్రమణలు, ఆర్టీసీ బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్ వద్ద మోహన్ హాస్పిటల్, శివ సాయి రెసిడెన్సీ వద్ద కాలువల ఆక్రమణలు, రవి గ్రూప్ థియేటర్స్ బుగ్గవంక ఆక్రమణలు తదితర వాటిని తక్షణమే తొలగించాలన్నారు. కడప నగరం జలమయం కావడానికి అడ్డుగా ఉన్న ప్రతి నిర్మాణాన్ని కూల్చాల్సిందే.. సిపిఐ గా స్వాగతిస్తున్నాం.. సహకరిస్తాం. అదేవిధంగా పెద్దల అక్రమ కట్టడాలను కూడా కూల్చాల్సిందే.. పేదల ఇళ్ల వద్ద అవసరానికి మించి వరద కాలువల వెడల్పుతో ఇల్లులు కూల్చడం తగదన్నారు. జిల్లా లో కాలువలు చెరువులు వాగులు వంకలు ప్రభుత్వ ,పోరంబోకు, దేవాదాయ, నీటి మునక, చుక్కల భూముల ఆక్రమిత స్థలాల, ఆన్లైన్ అక్రమ వ్యవహారంకు సంబంధించిన వివరాలు అందజేస్తాం.. వాటన్నింటి పై, భూ కబ్జాకోరులపై చర్యలు తీసుకునేందుకు, ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం సిద్ధం కావాలని పేర్కొన్నారు.

అనంతరం గేటు బయటకు వచ్చిన ఆర్ డి ఓ ధర్మ చంద్రారెడ్డి కి సిపిఐ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి యన్.వెంకట శివ,జిల్లా కార్యవర్గ సభ్యులు పి కృష్ణమూర్తి, నగర కార్యవర్గ సభ్యులు కెసి బాదుల్లా, పగడపూల మల్లికార్జున, నాగరాజు శంకర్ నాయక్, బ్రహ్మం, భాగ్యలక్ష్మి, ఆర్ బాబు, మునయ్య,ఆచారమ్మ, నారాయణ, దస్తగిరి, సుబ్బరాయుడు, ఓబులయ్య, భద్రయ్య, పకీరప్ప, తిరుపతమ్మ, దేవి, నిర్మలమ్మ, ఆదిలక్ష్మమ్మ ,కంబగిరి తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్రజ్యోతి గూడూరు రిపోర్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి జోగి రమేష్



గూడూరు/ మచిలీపట్నం 3 , 2022 ప్రజాపాలన :ఇటీవల మృతి చెందిన శ్రీ రెడ్రౌతుల నాగభూషణం ఆంధ్రజ్యోతి గూడూరు రిపోర్టర్ శ్రీ రెడ్రౌతుల త్రినాధ్ గారి మామగారు %రి% కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మృతి చెందిన రెడ్రౌతుల నాగభూషణం కుటుంబ సభ్యులను పేరుపేరునా పలకరించి వారికి ఓదార్చి వారికి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల ప్రజాప్రతినిధులు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి జోగి రమేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్.ప్రసన్న విశ్వనాధం



పెడన/ మచిలీపట్నం 3 , 2022 ప్రజాపాలన :మచిలీపట్నం మరియు పెడన అర్బన్ ఐ. సి. డీ.ఎస్ శాఖ సీ.డీ.పీ.ఓ గా బదిలీ పై వచ్చిన ఎస్.ప్రసన్న విశ్వనాధం శుక్రవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తోటి అంగన్వాడీ సిబ్బందితో కలసి గౌరవ రాష్ట్ర మంత్రివర్యులుజోగి రమేష్ కి పుష్పగుచ్ఛం అందించి వారి నుంచి శుభాకాంక్షలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐ. సి. డీ.ఎస్ సూపర్వైజర్ శ్రీమతి ఏ.జయంతి, అంగన్వాడీ వర్కర్లు ఎం.శ్రీదేవి, షకీలా తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎండ తీవ్రతను దృష్ట్యా కరువు పని కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి: ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



జగ్గయ్యపేట జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి: జయం తిపురం గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప థకం ద్వారా గ్రామాలలో పనిచేస్తున్న కూలీ పనులను శుక్రవారం శాసనసభ సభ్యులు సామినేని ఉదయభా ను పరిశీలించి,కూలీలతో మాటమంతీ నిర్వహించా రుఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో పేద లకు పనులు కల్పించడంలో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, ఉపాధి హామీ పథకం ప్రధాన ఉద్దే శ్యం గ్రామాల్లో వలసలు నివారించి ఉఫాది కల్పించ డం అని,ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు మం చినీరు అందుబాటులో ఉంచుకోవాలి అని, వడదెబ్బ కు గురి కాకుండా శీతల పానీయాలు తీసుకోవాల ని, ఆరోగ్య భద్రతాను పాటిస్తూ పనులు చేసుకోవాలని, ఏదైనా ఇబ్బందులు ఉంటే తెలియచేయవచ్చు అని తెలిపారు.

## నవరత్నాలతో నవశకానికి నాంది: ఎమ్మెల్యే మల్లాది విష్ణు

**61వ డివిజన్ లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం**



విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : నవరత్నాలతో నవశకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాంది పలికారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61 వ డివిజన్ – 257 వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పండగ వాతావరణంలో సందడిగా సాగింది. నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి, పార్టీ శ్రేణులతో కలిసి దాదాపు 1,210 గడపలను శాసనసభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఐతారాముల స్కూల్ రోడ్డు, మసీదు పార్కు రోడ్డు, గంగరాజు వీధి, సన్నాయమ్మ కొట్టు సెంటర్, భాస్కర్ రావు కొట్టు వీధులలో పర్యటించిన ప్రజాప్రతినిధులకు ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. జగనన్న మూడేళ్ల పాలనలో ప్రతిఒక్కరూ లబ్ధి పొందినట్లు ప్రజలు ఎమ్మెల్యేకు వివరించారు. సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకుంటున్నారని.. గడప గడపకు వెళ్తుంటే ఆ వివరాలు తెలుస్తున్నాయని మల్లాది విష్ణు అన్నారు. ప్రభుత్వం అందిస్తోన్న సాయంతో కొందరు జీవన ప్రమాణాలు మెరుగుపర్చుకుంటుండగా.. మరికొందరు తమ నివాస ప్రాంతాలను, ఇళ్లను అభివృద్ధి చేసుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాజు, డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, ఏఈ(ఇంజనీరింగ్) అరుణ్ కుమార్, ఏఈ (ఎలక్ట్రికల్) కృష్ణారెడ్డి, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు నందెపు జగదీష్, నాయకులు ఉమ్మడి వెంకట్రావు, గుండె సుందర్ పాల్, భోగాది మురళి, యరగొర్ల శ్రీరాములు, ఇసరపు రాజారమేష్, ఆర్.ఎస్.నాయుడు, నాళం బాబు, వియ్యపు రాజా, నాగరాజు, యక్కల మల్లిఖార్జునరావు, పార్టీ శ్రేణులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## బలమైన మూలాలు కలిగిన ప్రజాస్వామ్య వ్యవస్థ

**గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా**



విజయవాడ(రాజ్ భవన్ )/ మచిలీపట్నం 3 , 2022 ప్రజాపాలన :ప్రపంచ వ్యాప్తంగా కాలానుగుణంగా ప్రజాస్వామ్యం మార్పులకు లోనవుతున్నప్పటికీ అది తాత్కాలికమేనని గవర్నర్ వారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా అన్నారు. బలమైన మూలాలు కలిగిన ప్రజాస్వామ్యం భారత్ తో పాటు ప్రపంచ దేశాలకు ఆభరణం వంటిదన్నారు. అజాదీకా అమృత్ ఉత్సవ్ వేడుకలలో భాగంగా ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం, స్వాత్రంత్ర్య పోరాట కేంద్రం నేతృత్వంలో "ప్రజాస్వామ్య చరిత్ర" అన్న అంశంపై శుక్రవారం నిర్వహించిన వెబినార్ లో సిసోడియా విజయవాడ రాజ్ భవన్ నుండి కీలకోపన్యాసం చేసారు. చరిత్రను పరిశీలిస్తే ప్రజాస్వామిక విలువలు క్షీణిస్తున్నాయన్నది వాస్తవమే అయినా, ప్రజాస్వామ్య మూలాలు ఇప్పటికీ బలంగానే ఉన్నాయన్నారు. భారత్‌తో సహా పలు ప్రజాస్వామ్య దేశాలలో ఇది సరికొత్త రూపును అపాదించుకుంటుందన్నారు. పాలకుల పనితీరు ఫలితంగా అయా కాలాలలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నప్పటికీ అవి ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీన పరచలేవని సిసోడియా అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఉన్న స్వల్ప లోటుపాట్ల ఆలంబనతో ప్రపంచ వ్యాప్తంగా ఇది చర్చకు తావిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుని పైనా ఉందని వివరించారు. గత దశాబ్దాలలో సైతం ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలు ఉన్నాయని, అవి ఇప్పటి కిప్పుడు పుట్టుకొచ్చినవి కాదని పేర్కొన్నారు. ప్రస్తుత ధోరణికి అడ్డుకట్ట వేసేందుకు ప్రపంచ మేధావులు తగిన సూచనలు చేయాలని, పాలకులు సైతం వాటిని గౌరవించి స్వీయ నియంత్రణ పాటించవలసి ఉందని వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన్ననలు అందుకుంటున్న భారతదేశం ఇతర దేశాలకు ఆదర్శం కావాలన్నారు. ఈ వెబినార్ కు ముఖ్య అనుసంధానకర్తగా విశ్వవిద్యాలయం ఉపకులపతి అచార్య నాగేశ్వరరావు వ్యవహరించగా, సామాజిక శాస్త్ర విభాగ సహ అచార్య మయాంక్ కుమార్, స్వాతంత్ర్య పోరాట కేంద్రం సంచాలకులు అచార్య సత్యం, డాక్టర్ సుశీల్ కుమార్ తివారీ, డాక్టర్ సురేష్ కుమర్ ఘోష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి జోగి రమేష్ దంపతులు



కృత్తివెన్ను/ మచిలీపట్నం 3 , 2022 ప్రజాపాలన : కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను గ్రామంలో శ్రీ నాగ పూర్ణ సాయి పెట్రోల్ బంక్ వారి నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మంత్రి జోగి రమేష్ మరియు జోగి శకుంతలమ్మ దంపతులు. 214 ఏ జాతీయ రహదారిపై కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను గ్రామంలో పలు పరిసర గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండేలా స్థానిక కృత్తివెన్ను మండలానికి చెందిన శ్రీ తోట రాజేంద్ర గారు నెలకొల్పిన శ్రీ నాగ పూర్ణ సాయి పెట్రోల్ బంక్ వారి నూతన వ్యాపార ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాభినందనలు తెలియజేసిన రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీ జోగి రమేష్ మరియు శ్రీమతి జోగి శకుంతలమ్మ దంపతులు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు ,కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మైదానాన్ని సుందరంగా చేసిన వాకర్స్ అసోసియేషన్ కృషి అమోఘం



గన్నవరం,ప్రజాపాలన ప్రతినిధి జూన్ 03:గన్నవరం జడ్పీ బాలుర పాఠశాల మైదానాన్ని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సుందరంగా తీర్చిదిద్దుతున్నారు మాజీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్ బాబుతో ప్రారంభమైన అభివృద్ధి పనులు ప్రస్తుత వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించిన మదుపల్లి బాలకృష్ణ మరింత వేగంగా పనులు చేస్తున్నారు. వాకర్స్ సభ్యులు %డ% దాతలు తమ వంతు బాధ్యతగా గ్రౌండ్ అభివృద్ధి కి సాయం చేస్తున్నారు. వాకింగ్ ,రన్నింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేశారు. కరాటే , కుంగ్ ఫూ శిక్షణ పొందేందకు ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు చేస్తున్నారు. చిన్న పిల్లలు సరదాగా అడుకునేందకు జారుడు బల్లలు , జైయింట్ వీల్స్ తరహాలో పలు అట వస్తువులు ఏర్పాటు చేయపోతున్నారు వ్యాయామ కసరత్తులు చేయటానికి చిన్న చిన్న జీమ్.పరికరాలు దాతలు కొద్ది రోజుల క్రితమే సాయం చేసినట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యం. బాలకృష్ణ , ప్రధాన కార్యదర్శి డాక్టర్ చిప్పాడ చంద్రశేఖర్ తెలిపారు.

## జిల్లాలో ఉపాధిహామి పనుల్లో రాష్ట్రంలో మొదటి రెండు స్థానాల్లో ఉంటున్నాం: జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా



మచిలీపట్నం కలెక్టరేట్ 3 , 2022 ప్రజాపాలన :జిల్లా కలెక్టర్ శుక్రవారం బందరు మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు పరిశీలించారు. బందరు మండలం అరిసెపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో చిట్టిపాలెం గ్రామంలో రాళ్లగుంట చెరువు పూడికతీత పనులు ఉపాధిహామి పథకం క్రింద చేపట్టగా పనులు పరిశీలించినకలెక్టర్ కూలీల హాజరుపట్టి తనిఖీ చేసి ఎంత మంది హాజరు అయ్యారు పరిశీలించారు. ఇది ఊర చెరువు దీని విస్తీర్ణం 3.75 ఎకరాలు కాగా గత 2 వారాలుగా చెరువులో పూడిక తీత పనులు చేస్తున్నారని, 3,800 వరకు పని దినాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామంలో మొత్తం 305 మంది జాబ్ కార్డులు కలిగి ఉండగా వారిలో 170 మంది చెరువు పనికి వస్తున్నారని, రోజుకు గరిష్టంగా 250 రూ.లు వరకు కూలీ అందుతున్నదని కలెక్టరుకు తెలిపారు. మిగత వారు ఏదైన పనులకు వెళ్లుతున్నారా లేదా కలెక్టర్ ఆరా తీశారు. ఎంబుక్లో ఎంట్రీలు తనిఖీ చేశారు.పనులు చేస్తున్న కూలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కూలీలకు త్రాగునీరు, మజ్జిగ సరఫరా చేస్తున్నారా అధికారులను ప్రశ్నించారు. పనిలోకి ఉదయం ఎన్ని గంటలకు వస్తున్నారు, ఎన్ని గంటల వరకు పని చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. లేబర్ కోసం ఇంకా ఎక్కువగా ఉన్నందున మరింత మంది పని చేసే విధంగా చూడాలన్నారు. కూలీలకు కొలతలు ఏవిధంగా వేస్తున్నారని మేట్ ను కలెక్టర్ ప్రశ్నించారు. చెరువు పనులు అయిపోయాక ఏమి చేస్తారని కలెక్టర్ ప్రశ్నించగా వరి సాగుకు సంబంధించి వ్యవసాయ పనులకు వెళతామని చెప్పగా కూలి ఎంత ఇస్తారని కలెక్టర్ ప్రశ్నించగా సరాసరి 500 రూ.ల వరకు ఇస్తారని తెలిపారు.ఏడాదిలో 100 రోజులు పని కల్పిస్తున్నారా కలెక్టరు ప్రశ్నించగా గత ఏడాది 100 రోజులు పని కల్పించారన్నారు. అందరికి బియ్యం కార్డులు ఉన్నాయా మీఇళ్లకు వచ్చి రేషన్ బియ్యం అందిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. మీ కుటుంబాలలో ఏఏ పథకాలు పొందారు అని ప్రశ్నించగా అమ్మఒడి పథకం 2వ విడత రాలేదని, విద్యాదీవెన 3వ విడత రాలేదని కొంత మంది చెప్పగా ఈకేవైసి చేయించుకోవాలని ఆధార్ నమోదులో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామంలో జగనన్న హౌసింగ్ లేఅవుట్లో 277 మంది అర్హత కలిగి ఉండగా 184 మందికి పట్టాలు ఇచ్చారని, మిగత వారికి కూడా ఇప్పించాలని కోరగా అర్బన్లో ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఓటిఎస్ పథకం క్రింద 135 మందికి రిజిస్ట్రేషన్లు జరిగాయని పట్టాలు వెంటనే అందించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటిదాకా 28 లక్షల పని దినాలు కల్పించినట్లు, ఉపాధిహామి పనులు చేపట్టడంలో రాష్ట్రంలో మొదటి రెండు స్థానాల్లో ఉంటున్నామని కలెక్టర్ తెలిపారు. రోజుకు సరాసరి 250 రూ.ల వరకు కూలీ వచ్చేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మరో 2 నెలల వరకు ఉపాధిహామి పనులు బాగా ఉంటాయని వర్షకాలంలో కూడా కూలీలకు ప్రత్యామ్నయ పనులు కల్పించుటకు కృషి చేస్తామన్నారు.

## అత్తను చంపిన అల్లుడిని అరెస్టు చేసిన పోలీసులు




వీరులపాడు జూన్ 3 ప్రజా పాలన ప్రతినిధి మండల పరిధిలో జయంతి గ్రామంలో గత బుధవారం రాత్రి అ త్త ను చంపిన అల్లుడు కేసులో నిందితుడు దావీదు రాజును అరెస్టు చేసిన వీరులపాడు పోలీసులు. నిందితుడిని విలేకరుల సమావేశంలో మీడియా ముందు ప్రవేశ పెట్టిన ఏసీపీ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ నింది తుడిని పెద్దాపురం చెక్పోస్ట్ వద్ద గురువారం సాయం త్రం అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. హత్య జరిగిన 24 గంటల్లోపు ముద్దాయి ను అరెస్ట్ చేసినం దుకు నందిగామ గ్రామీణ సి ఐ నాగేంద్ర కుమార్, వీ రులపాడు ఎస్ఐ సోమేశ్వరరావులను ప్రత్యేకంగా అ భినందించారు.

# టీడీపీకి అనుకున్నంత ఈజీయేం కాదు

విజయవాడ, జూన్ 3, : తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబుకు రానున్న ఎన్నికలు సవాల్ అని చెప్పక తప్పదు. వచ్చే ఎన్నికలు పార్టీ మనుగడను కూడా ప్రశ్నార్థకం చేస్తాయి. అధికారం మరోసారి దక్కకపోతే పార్టీ మనుగడ కూడా కష్టసాధ్యమే అవుతుంది. అందుకే చంద్రబాబు తనకు శక్తికి మించి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ నేతల్లోనూ, క్యాడర్ లోనూ కొంత విశ్వాసాన్ని అయితే నింపగలిగారు. కానీ ప్రజలలో మాత్రం ఇంకా విశ్వాసాన్ని నింపలేకపోతున్నారు. అందుకు అనేక కారణాలున్నాయి. చంద్రబాబు నాయకత్వంపై నమ్మకం ఉన్నప్పటికీ ఆయన చెప్పే మాటలకు, ఇచ్చే హామీలకు విశ్వసనీయత లేకపోవడం. దివ్యవాణి వంటి నేతలు పార్టీని వీడటం కూడా పార్టీకి ఇబ్బంది కలిగించేవే. ఆమె చెప్పినట్లుగానే బాబు కొందరి చేతుల్లో బందీ అయ్యారన్నది కాదనలేని వాస్తవం. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన సమాచారాన్ని కొందరు పార్టీ నేతలు చంద్రబాబును తప్పుదోవ పట్టిస్తున్నారన్న దివ్యవాణి మాటల్లో నిజం లేకపోలేదు. అది సరిచేసుకునే వయసు చంద్రబాబుది కాదన్నది కూడా అంతే నిజం. చంద్రబాబుకు సమర్థ నాయకుడిగా పేరుంది. మంచి అడ్మినిస్ట్రేషర్ గా కూడా ఆయన గుర్తింపు పొందారు. దానిని ఎవరూ కాదనలేరు. ఆయన విజన్ ను కూడా ఎవరూ తప్పుపట్టలేరు. కానీ సంక్షేమ పథకాలకు వచ్చే సరికి ఆయనపై పేద, దిగువ, మధ్య తరగతి ప్రజల్లో విశ్వాసం లేదు. ముఖ్యంగా జగన్ అమలు పర్చే వివిధ పథకాలను, కార్యక్రమాలను చంద్రబాబు అధికారంలోకి వస్తే కొనసాగించరన్న నమ్మకం ప్రజల్లో ఉంది. జగన్ వివిధ పథకాల ద్వారా నగదు రూపంలో ఇచ్చే పథకాలు కావచ్చు. ముఖ్యంగా ఆరోగ్య శ్రీ విషయంలో కావచ్చు చంద్రబాబు కొనసాగించరన్న నమ్మకం ఆ వర్గాల ప్రజల్లో బలంగా ఉంది. దాదాపు మూడున్నర కోట్ల మంది వివిధ పథకాల ద్వారా లబ్ది పొందుతున్నారు. మధ్య, ఎగువ తరగతి ప్రజల్లో వైసీపీ పట్ల వ్యతిరేకత కన్పిస్తుంది. అయితే వారిలో ఎంత మంది పోలింగ్ కేంద్రాలకు వస్తారన్నది సందేహమే. ఎందుకంటే వారికి ఎన్నికలపై పెద్దగా నమ్మకం లేకపోవడం, క్యూలైన్లలో నిలబడి నిరీక్షించే ఓపిక లేకపోవడం వంటి కారణాలు ఆ వర్గాలు ఓటింగ్ కు కొంత దూరంగా ఉంటూ వస్తున్నట్లు గత ఎన్నికల పోలింగ్ తీరు చెబుతుంది. ఇక ఉద్యోగస్థుల్లో కొంత వ్యతిరేకత కన్పిస్తుంది.

అయినా ఆర్టీసీ వంటి ఉద్యోగులు చంద్రబాబు తమను ప్రభుత్వంలో కొనసాగిస్తారన్న నమ్మకం లేదు. అందుకే ఆర్టీసీ ఉద్యోగులతో పాటు, మరికొన్ని సంస్థల ఉద్యోగులు చంద్రబాబు సంస్కరణల వైపు మొగ్గు చూపుతారన్న సందేహంతో వారు తిరిగి సైకిల్ కు ఓటు వేసే ధైర్యం చేయరన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఓటు భారీగా ఉన్నప్పుడు మాత్రమే విజయం సాధ్యమవుతుంది. దీంతో పాటు స్థానిక ఎమ్మెల్యేల పట్ల ఉన్న వ్యతిరేక కూడా ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా మారతాయి. రెండేళ్ల సమయంలో జగన్ ఆ వ్యతిరేకతను కొంత తగ్గించే చర్యలు చేపట్టే వీలుంది. గతంలో చంద్రబాబు మహాకూటములు ఏర్పాటు చేసినా ఆయన విజయం సాధించలేకపోయారన్న వాదన ఎటూ ఉండనే ఉంది. ఈసారి కూడా అన్ని రాజకీయ పార్టీలు ఏకమయినా తమ విజయం ఖాయమన్న ధీమాలో వైసీపీ ఉంది. అయితే చంద్రబాబు ఈసారి తనకు చివరసారి ఛాన్స్ ఇవ్వాలని ప్రజల ముందుకు వెళ్ళనున్నారు. ఏది ఏమైనా వచ్చే ఎన్నికల్లో నెగ్గుకు రావడం చంద్రబాబుకు అంత సులువు కాదు. జగన్ పై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత తీవ్రమై అది పోలింగ్ కేంద్రాల వరకూ వస్తేనే బాబుకు విజయం సాధ్యమవుతుందన్నది విశ్లేషకుల అభిప్రాయం. మరి రానున్న కాలంలో ఏం జరుగుతుందో చూడాలి.

## ఎమ్మెల్యేల దాడులపై చర్చోపచర్చలు



రాజమండ్రి, జూన్ 3, :పోలవరం ఇంజినీర్‌పై వైసీపీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందరి ముందు దాడి చేయడం ఉద్యోగవర్గాల్లో కలకలం రేపుతోంది. పోలవరం కాలువ అంచనాలు పెంచి బిల్లులు తయారు చేయాలని రాజా ఆదేశిస్తే.. ఆ ఇంజినీర్ తన వల్ల కాదన్నారు. అది నచ్చని రాజా? సమావేశంలోనే ఇతర ఉన్నతాధికారులు ఉండగానే దాడి చేశారు. మూడుసార్లు చెంపలు వాయించారు. మామూలుగా అయితే ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం చిన్న విషయం కాదు . కానీ ఇక్కడ మాత్రం ఆ దాడికి గురయిన ఇంజినీర్‌కు ఉన్నతాధికారుల సపోర్ట్ కూడా లేదు. అయితే ఆ ఉద్యోగి మాత్రం తన్నులు తిన్నది తాను కాబట్టి .. వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా పోస్టులకు తప్ప ఇలాంటి కేసులు చిన్న చిన్నవనుకునే పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఉద్యోగి ? మనకెందుకు చెప్పు కష్టాలు? మూడు దెబ్బలేగా వదిలేస్తా పోలా అన్నట్లుగా మైండ్ సెట్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో ఉద్యోగి పని చేస్తున్న జలవనరుల శాఖ ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. ఇదంతా మంత్రి అంబటి రాంబాబు పర్యటన నేపథ్యంలో జరిగింది. అయితే ఎమ్మెల్యే రాజా ? ఇంజినీర్‌పై దాడి చేసినప్పుడు ఆయన మరో రూంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. వైసీపీ నేతలు ఇతరుల్ని కొడతాం.. తిడతాం.. దాడి చేస్తామన్న హెచ్చరికలు ఇటీవలి కాలంలో ఎక్కువైపోయాయి. కొంత మంది నేరుగా యాక్షన్‌లోకి వచ్చేస్తున్నారు. ఎవరిని పడితే వారిని కొట్టడానికి వెనుకాడటం లేదు. చట్టం వైసీపీ నేతలకు వర్తించదని పోలీసులు ఇప్పటికే వెసులుబాటు ఇచ్చేశారేమో కానీ చంపుతామని బెదిరిస్తున్న వారికి కూడా కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. అందుకే? అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చెలరేగిపోతున్నారు.

## బెల్లంపల్లిలో పట్టణ ప్రగతి కార్యక్రమాలను ప్రారంభించిన చైర్ పర్సన్ జక్కుల శ్వేత



బెల్లంపల్లి జూన్ 3 ప్రజా పాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాలుగో విడత పట్టణ ప్రగతి కార్యక్రమాలను, బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం నాడు మున్సిపల్ చైర్ పర్సన్ శ్వేత ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు 14వ వార్డు 15 వార్డుల్లో, పట్టణ ప్రగతి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒకటో వార్డు కన్నాల బస్టిలో వార్డు కౌన్సిలర్ సూరం సంగీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు, గతంలో చేపట్టిన పనులు ఈ మేరకు పూర్తయ్యాయని, ఎందుకు కాలేదని, ప్రస్తుతం పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఏ కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉందని, ప్రజలతో సిబ్బందితో ఆమె చర్చించారు, వెంటనే ఆయా పనులు పూర్తి కావడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి పనులు పూర్తి అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపాల రజిత, టిఆర్ఎస్ నాయకులు శ్రీధర్, సూరం బానేష్, కౌన్సిలర్ కొక్కేర చంద్రశేఖర్, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు, జేఏసీ నాయకులు, డ్వాక్రా మహిళా గ్రూపు సంఘాల ప్రతినిధులు, ఆయా వార్డుల కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం ప్రారంభం



జన్నారం రూరల్, జున్ 03, ప్రజాపాలన: మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో 2022-2023 విద్యా సంవత్సరం గాను బడి బాట కార్యక్రమాలు చేపట్టడం జరిగినదని మండల విద్యాధికారి విజయ్ కుమార్ అన్నారు, ఈ సందర్భంగా శుక్రవారం మాట్లాడుతూ మూడు నుంచి పదవ తేదీ వరకు నమోదు డ్రీవీ నిర్వహించబడుతుంది. బడి వయస్సు పిల్లలందరిని పాఠశాలలలో చేర్పించట. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలు పాఠశాలలో చేర్పించుట, బడి మానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలలో చేర్పించట, ఆంగ్లం మీడియం ప్రవేశ పెట్టుట తల్లిదండ్రులు అవగాహన కల్పించి, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించట, అదేవిధంగాపదమూడువ తేదీ నుండి ముప్పది వ తేదీ వరకు పాఠశాలలయందు మనఊరు మనబడి, ఆంగ్లామద్యమంపై రోజుకోక్క కార్యక్రమం బడిబాటలో చేపట్టడం జరుగుతుందన్నారు, ఈ సమావేశంలో ఉపాద్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎస్ఎంసి కమిటి సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడే పదో తరగతి పరీక్షా ఫలితాలు

అమరావతి, : పదో తరగతి పరీక్షల ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలు విడుదల చేయనున్నారు. ఏప్రిల్‌లో రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

**ర్యాంకులు ప్రకటిస్తే శిక్షార్హులు..**

గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డి. దేవానంద రెడ్డి పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ర్యాంకులు ప్రకటించడం నిషేధమని, అలా ప్రకటిస్తే చట్టరీత్యా శిక్షార్హులని గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ డైరెక్టర్ డి. దేవానంద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2020 నుంచి గ్రేడ్‌ల స్థానంలో విద్యార్థులకు మార్కులు ప్రధానం చేసే పద్ధతిని ప్రవేశపెట్టామన్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల విభాగం విద్యార్థులకు ఎటువంటి ర్యాంక్‌లను కేటాయించడం లేదని ఆయన తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని పాఠశాల యాజమాన్యాలు ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల కోసం ఏ స్థాయిలోనైనా ర్యాంకులు ప్రకటించడం, ప్రచురించడం నిషేధించడం జరిగిందన్నారు. 1997 చట్టం 25 సెక్షన్ 8 ప్రకారం ఎవరు ఉల్లంఘించినా, ఉల్లంఘించే ప్రయత్నం చేసినా, కుట్ర చేసినా లేదా ప్రోత్సహించినా మూడు సంవత్సరాలకు పైబడి ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తామని, జైలు శిక్షతో పాటు- జరిమానా ఐదు వేల నుంచిలక్ష రూపాయల వరకు విధించడం జరుగుతుందని దేవానంద్ రెడ్డి స్పష్టం చేశారు.

## పల్లె ప్రగతి లో పాల్గొన్న జెడ్పీటీసి నిత్య నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలంలో పర్యటించిన మంచాల జడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి ఈ రోజు మంచాల్, జాపాల్, రంగాపూర్ ,గ్రామాలలో పల్లె ప్రగతి కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పిటిసి,ఈ సందర్భంగా రంగాపూర్ పాఠశాల అభివృద్ధి కొరకు జిల్లా పరిషత్ నిధుల నుండి రెండు లక్షల రూపాయల ప్రొసిడింగ్ ను అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో స్పెషలాఫీసర్ ,డిప్యూటీ సీఈఓ రంగా రావు , మరియు జైపాల్ రెడ్డి, సర్పంచులు మమత, జగన్ రెడ్డి, నహీద బేగం, ఎంపీటీసీలు నరేందర్ రెడ్డి,జయ నందం, చంద్రశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ లు, మరియు వార్డు మెంబర్లు,లింగం గౌడ్, నాయకులు బలరాజు, పంచాయతీ సెక్రటరీలు కారోబార్ లు, ఆశావర్కర్లు, అంగన్వాడి టీచర్లు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రగతి కార్యక్రమం



మధిర 3 జూన్ ప్రజా పాలన ప్రతినిధి : పట్టణ ప్రగతి భాగంగా శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ మరియు మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లతా జయకర్ మున్సిపల్ కమిషనర్ రమాదేవి ఆదేశాల మేరకు నాలుగో విడత పట్టణ ప్రగతి ఇ కార్యక్రమంలో భాగంగా 13 14 వ వార్డులో కౌన్సిలర్ వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో మీటింగ్ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు మరియు 14వార్డ్ ఇంచార్జ్ కపిలవాయి జగన్ మోహన్ రావు మరియు యు.టి ఆర్ఎస్ నాయకులు ఆవుల రామకృష్ణ మార్తా అప్పారావు వార్డు పెద్దలు మున్సిపల్ సిబ్బంది మేస్త్రీ ఆశ వర్కర్లు అంగన్వాడీ సిబ్బంది వార్డు సభ్యులు పాల్గొనడం జరిగింది.

## సోమిరెడ్డి డీలా పడ్డారు...



నెల్లూరు, జూన్ 3, :వరసగా మూడు సార్లు ఓడితే టిక్కెట్లు ఇచ్చేది లేదని టీడీపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. యువనేత లోకేష్ ప్రకటనతో ఇది అధికార ప్రకటన అయింది. ఒంగోలులో జరుగుతున్న మహానాడులో లో ఈ ప్రకటన చేశారు. అయితే దీనికి సంబంధించి పార్టీలో చర్చ మొదలయింది. 2009, 2014, 2019 ఎన్నికల్లో ఓటమి చెందిన వారికి టిక్కెట్లు ఇచ్చేది లేదన్నది పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రకటించారు. అయితే ఈ కోవలో అతి కొద్ది మంది మాత్రమే ఉన్నారు. దీనిపై పార్టీలో కొంత చర్చ జరుగుతుంది. అభ్యంతరాలు కూడా వ్యక్తమవుతున్నాయి. నెల్లూరు జిల్లాలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వంటి సీనియర్ నేతలకు టిక్కెట్ దక్కే అవకాశం లేదు. ఇప్పటికే ఆయన ఐదు సార్లు ఓటమి చెందారు. సర్వేపల్లి నియోజకవర్గం నుంచి సోమిరెడ్డి చివరి సారి 1999 వ ఎన్నికల్లో మాత్రమే గెలిచారు. ఆ తర్వాత ఆయన వరసగా ఓటమి చెందారు. ప్రస్తుతం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈసారి ఎన్నికలపై ఆశలు పెట్టుకునే ఉన్నారు.ఖచ్చితంగా విజయం సాధిస్తానని నమ్మకం పెట్టుకుని ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ఈసారి విజయం తనదేనన్న ధీమాతో ఉన్నారు. లోకేష్ ప్రకటనతో సోమిరెడ్డి డీలా పడ్డారు. అయితే సోమిరెడ్డి స్థానంలో ఆయన కుమారుడు ఇప్పటికే సర్వేపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. చంద్రబాబు నిర్ణయించినట్లు వచ్చే ఎన్నికల్లో నలభై శాతం టిక్కెట్లు యువతకేనని ప్రకటించడంతో ఆయన తన కుమారుడిని పోటీ చేయించి తాను తప్పుకోవాల్సి ఉంటుంది. పార్టీ అధికారంలోకి వస్తే జిల్లాలో సీనియర్ నేతగా పదవులను దక్కించుకునే ఛాన్స్ ఉంది. అయితే కాకాణిని ఓడించాలంటే తన కుమారుడి కంటే తాను మాత్రమే రంగంలో ఉంటేనే సాధ్యమవుతుందన్న వాదనలు లేకపోలేదు.

## గ్రామాభివృద్ధి కోసం అధికారులు సేకరించాలి: సర్పంచ్ మేజి అంజయ్య



కరీంనగర్ జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి : పల్లె ప్రగతి ఐదో విడతలో భాగంగా మన్నెంపల్లి గ్రామపంచాయతీ ఆవరణంలో గ్రామసభ నిర్వహించి ఈ పల్లె నివేదికలో వివిదఅభివృద్ధి పనుల విషయమై చర్చించడం జరిగింది.గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను అందించాల్సిన అవసరం ఉమదని సర్పంచ్ మేజి అంజయ్య కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడి అంజయ్య స్పెషల్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ వార్డ్ మెంబర్స్ పరునంది సంపత్,తూముల శ్రీనివాస్,కో ఆప్షన్ గోవింద్ రావు,తునికి కనుకయ్య, హై స్కూల్ హెచ్ఎం ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఉపన్యాసకులు ఆశా వర్కర్లు అంగన్వాడి టీచర్లు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## పల్లె ప్రగతి కార్యక్రమం లో ప్రజా సమస్యలపై దృష్టి సారిస్తాము: సర్పంచ్ కిన్నెర వాణి



బోనకల్, జూన్ 3 ప్రజాపాలన ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఐదవ విడత పల్లె ప్రగతి కార్యక్రమం లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రాయపేట గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ కిన్నెర వాణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పల్లె ప్రగతి కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా లావూరి ఝాన్సీ హాజరయ్యారు. అనంతరం పలు వార్డుల్లో ఉన్న సమస్యలను వార్డు ప్రజల సహాయంతో చర్చించి అట్టి సమస్యలపై దృష్టి సారిస్తామని గ్రామ సర్పంచ్, ప్రత్యేక అధికారి లావూరి ఝాన్సీ వార్డు మెంబర్లకు, గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ఈవూరి రాధాకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి రేణుక, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్లు ,గ్రామ పంచాయతీ సిబ్బంది ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**ఎర్రవల్లి గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్**



వికారాబాద్ బ్యూరో 03 జూన్ ప్రజాపాలన : ఎర్రవల్లి గ్రామాన్ని పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని గ్రామ సర్పంచ్ చొప్పరి మల్లమ్మ హనుమంతు ఉప సర్పంచ్ నది మున్నీసా గఫార్ లు సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామములో ఐదవ విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రవేశ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి వార్డులోని సమస్యలను తెలుసుకొనుటకు గల్లి గల్లి తిరిగి ప్రజలను అడిగి తెలుసుకున్నామని వివరించారు. తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరణ చేసి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నామని స్పష్టం చేశారు. మోరీ లలో చెత్తాచెదారాన్ని వేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తా చెదారంతో నిండి ఉన్న మోరీ లను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని చెప్పారు. సీఎం కేసీఆర్ లక్ష్యానికి అనుగుణంగా ఎర్రవల్లి గ్రామాన్ని తీర్చిదిద్దే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని విశ్వాసం వ్యక్తపరిచారు. వికారాబాద్ మండల పరిధిలోనే ఎర్రవల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుటకు అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు.

## ఖాన్ నాయకత్వంపై అనుమానాలు

లాహోర్, జూన్ 3, :అధికారంలో వున్నపుడు తిరుగులేదనుకున్నవాడు అందరూ కలిసి కిందకి దింపగానే అసలు దేశమే నాశనమైపోతుందని బాహాటంగానే ప్రకటించడం పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ నోటిదూల. ఈ కాలంలో ఏ దేశంలోనైనా ప్రధానిని సైతం ఛీత్కరించే ఓటర్లు, కుర్చీనుంచీ దించేసే సేనా నాయకులు వున్నారు, వుంటారు. తాను వున్నపుడే దేశం మహాద్భుతంగా వుందని, తనని దించేయడం దేశానికి అరిష్టమని అనడం ఖాన్‌గారి అమాయకత్వమే అవుతుంది. సరయిన నిర్ణయాలు తీసుకుని దేశాన్ని ప్రగతి పథంలో నడపాలనే ఎవరయినా అనుకుంటారు. కానీ నీకు నచ్చలేదని ఆ నిర్ణయాలు దేశాన్ని దారుణ పరిస్థితులకు దారితీయిస్తాయని అనడం ఖాన్‌గారి మానసిక స్థితికి పరాకాష్ట. ఇది నిజానికి ఖాన్ స్వయంకృతం. ఇమ్రాన్ కి దేశాధినేత పీఠం పిచ్చ బాగానే అబ్బింది. అందుకనే అది దూరమయిన బాధలో పాపం ఏం మాట్లాడుతున్నాడో కూడా తెలియడం లేదు. మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో గతే పట్టిందనే అనుకోవాలి, తిరిగి అధికారంలోకి రావడం కడు దుర్లభం. మరి ఏం చేస్తూ కాలం గడుపుతారని ఏకంగా ప్రెస్ వారే అడిగేరు. ఖాన్‌గారు ఇంకా గొప్ప క్రికెటర్‌గా ప్రపంచ క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటున్నానన్న, హీరో భ్రమలోనే వున్నారు. మనోడు ఏదో చేస్తాడని పీఠం ఎక్కిస్తే సైనికాధికారుల మాట వినకా తప్పలేదు. తన మాట చెల్లించుకుని ఏదో చేసేనని ప్రచారం చేయించుకోవడానికి నానా తంటాలూ పడ్డాడు. ఏకంగా పదవీ పోయింది. ఇపుడు వుక్రోషంతో వున్నాడు. స్కూల్లో టీచర్ సొంటిపిక్క పెట్టినందుకు పుస్తకాలు చింపేసిన చిన్నపిల్లాడి ఆగ్రహం ఎంతవరకూ సబబు. పరిస్థితులు బేరీజువేసుకుని తాను మళ్లీ అధికారంలోకి రావడానికి మార్గాలు సుగమం చేసుకోవాలేగాని నోటి దూలంతా ప్రదర్శిస్తే పడి చావడానికి గతంలో ఆయన్ను అభిమానించిన క్రికెట్ సంఘంవారు కాదు మిలటరీ అధికారులు. పైగా దేశ ఆర్థిక పరిస్థితి దెబ్బతినే నిర్ణయాలు తీసుకో వడం దారుణ స్థితికి దేశాన్ని నెట్టేస్తుందని తెహ్రీక్ ఇన్‌సాఫ్ నేత గోడు పెడుతున్నాడు. తాను అధికారంలో వుంటేనే దేశం బాగుంటుందని లేకుంటే విచ్ఛిన్నమవుతుందన్న అబిప్రాయాలు ఇమ్రాన్ బుద్ధి హీనతనే స్పష్టం చేస్తుంది. ఆర్థికంగా పూర్తిగా దెబ్బతినేకాలం ఆట్టేదూరంలో లేదన్నది ఇమ్రాన్ ఖాన్ భవిష్యత్ వాణి. కానీ ఇదంతా ఆయన ఆశిస్తున్నదేగానీ, నిజానికి ఏ పాకిస్తానీ దేశం చీలి పోవడాన్ని ఇష్టపడటం లేదని, ఇదంతా భారత్ ప్రధాని మోడీ అలవాటు చేసిన పదజాల మహత్తేనని పాక్ మాజీ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తిట్టిపోసేడు. ఖాన్ క్రమేపీ భారత్ భాషకు బాగా అలవాటు పడుతు న్నా డన్నది పాక్‌కి మింగుడుపడుతుందా? అధికారంలో వున్నపుడు ఒకలాగా, దిగిపోగానే మరొక లాగా వ్యాఖ్యానించడం, ఆగ్రహించడమన్నది మరి పొరుగువారి చలవేనని పాక్ మాజీ అధ్యక్షుల వారి ఉవాచ. నిజమే కావచ్చు కొండకచో ఇమ్రాన్‌కి భారత్ పట్ల కొంత ప్రేమే వుండవచ్చు.

# ఓ వైపు ధరలు.. మరో వైపు అవినీతి

దేశం సిస్టంలో అవినీతి ఒక భాగం అయిపోయింది. పేదరికం 80 శాతం పెరిగింది. 94.11 శాతం మంది ఆదాయం 10 వేల రూపాయల కన్నా తక్కువకు దిగజారింది. ధరల భారం దేశంలోని ప్రతి కుటుంబం పైనా అదనంగా 7,500 రూపాయల మేరకు పడింది. షేర్ బజార్ నుంచి 1,65,000 కోట్ల విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. ప్రజల ఆదాయం 2021లో 50 శాతం పడిపోతే, ఈ ఏడాది జనవరి వరకు 60 శాతం పడిపోయినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఆర్‌బీఐ అంచనా ప్రకారం 2034-35 వరకు కూడా అధిక ధరల పరిస్థితి మారే సూచనలు లేవు. అదానీ, అంబానీల మాదిరిగా ప్రజాప్రతినిధుల ఆస్తులు పెరిగాయి. బీజేపీ లాంటి పార్టీ లకు ఫండ్స్ పెరిగాయి. దేశం ఆర్థిక పరిస్థితి కుదేలయ్యింది. వాస్తవాలను కేంద్రం అంగీకరించే పరిస్థితి లేదు. బీజేపీ గద్దె దిగినా, దేశం ఆర్థిక పరిస్థితి గాడిలో పడడానికి మరో దశాబ్దం పట్టక తప్పదంటున్నారు ఆర్థిక నిపుణులు. అబద్ధాలు, అమలు కాని హామీలు రాజకీయాలలో ఎలా సహజం అయిపోయాయో, అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతాలు కూడా నేతలకు సహజం అయిపోయాయి. అయిదేండ్లలో ప్రజాప్రతినిధుల ఆస్తులు ఐదు నుంచి పదింతలు పెరుగుతున్నాయి. ఆదాయానికి మించి సంపాదన 85 శాతం ప్రజా ప్రతినిధులలో స్పష్టంగా కనిపిస్తున్నది. అవినీతికి పాల్పడ్డారని పంజాబ్ ఆరోగ్య శాఖ మంత్రి విజయ్ సాంగ్లీని తాజాగా సీఎం భగవంత్‌మాన్ కేబినెట్ నుంచి తొలగించారు. ఆయన మీద కేసు పెట్టి జైలుకు పంపారు. అవినీతి నేతలుగా ముద్రపడిన ఇలాంటివారు తమ రాజకీయాలను కొనసాగిస్తూనే ఉంటారు. తమకున్న డబ్బు, హంగూ, ఆర్భాటంతో ఎన్నికలలో విజయం సాధిస్తూనే ఉంటారు. అవినీతి, అక్రమాలు, మితిమీరిన సంపాదన దేశ రాజకీయ నాయకులకు షరా మాములు అయిపోయాయి. 'ఎవరిని చూసినా ఏమున్నది గర్వకారణం?' అనే విధంగా ఉంది పరిస్థితి. ఫలానా రాజకీయ పార్టీలో ఫలానా నేత 'దూద్ కా ధులా హువా నేతా హై' అని చెప్పుకోవడానికి ఈ కాలంలో ఎవరూ లేరు. కానీ, వారి ఫొటోలకు మాత్రం కార్యకర్తలు పాలాభిషేకం చేస్తూనే ఉంటారు. పాల ధర కూడా ఆకాశాన్నంటిన మన దేశంలో ఇది కామన్ అయిపోయింది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అధికార, విపక్ష నేతలందరిదీ ఇదే పరిస్థితి. అందుకే, పాలకులు ఎక్కడ ఈడీ, సీబీఐ తదితర కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తారో అనే భయంతో నాయకులు వ్యవహారం నడుపుతుంటారు. 'పాము చావొద్దు-కర్ర విరగొద్దు' అనే తీరుగ వారి మాటలు ఉంటాయి. నిజానికి మనీ లాండరింగ్, లంచం, అక్రమాలు, ఆదాయానికి మించి ఆస్తులకు సంబంధించిన కేసులు ఉన్న వారంతా జైలులో ఉంటే, వారికి అయిదేండ్ల కన్నా ఎక్కువ శిక్షలు పడే అవకాశం ఉంటే ఈ దేశ రాజకీయాలు మారిపోయేవి. రాజకీయాలలో కొంతలో కొంత అయినా నిజాయితీపరుల ప్రవేశాన్ని మనం చూడగలిగేవారం. కానీ, అలా జరుగదు ఎందుకంటే విపక్ష నేతలు అయినా, అధికార నేతలు అయినా ఎవ్వరూ కేసులకు అతీతులు కారు కాబట్టి అంతా కలిసిమెలిసే ఉంటారు. అధికారంలో ఉన్న పార్టీలో చేరితే కేసులన్నీ మాఫ్ లేదా పెండింగ్. బెంగాల్, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, బిహార్, గుజరాత్, గోవా, జమ్మూ-కాశ్మీర్, రాజస్థాన్, తమిళనాడు ఇలా దాదాపు 12 రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి ఉంది. బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం సభ్యులందరూ ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్నారు. తమిళనాడు దివంగత సీఎం జయలలిత కూడా కేసులు ఎదుర్కొన్నారు. డీఎంకే, ఏఐడీఎంకే, నేతలు, బీఎస్‌పీ నేత మాయావతి, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, కాంగ్రెస్ నేత హుడా, కేంద్ర మాజీ మంత్రి చిదంబరం, మహారాష్ట్రలో శివసేన, కేంద్ర మాజీ మంత్రి శరద్‌పవార్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ బంధువులు, పార్టీ నేతలు, జార్ఖండ్ సీఎం హేమంత్ సొరైన్, ఏపీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇలా చాలా మంది నేతల మీద కేసులు ఉన్నాయి. అధికారంలో ఉన్నవారు తమని తాము నిజాయితీపరులుగా చెప్పుకోవడానికి అప్పుడప్పుడు విపక్షాల కేసులను బయటికి తీసి బెదిరిస్తుంటారు. ఇప్పుడు మంత్రులుగా ఇప్పుడు కొనసాగుతున్నవారి పేర్లు కూడా ఇందులో ఉంటాయి. అయితే, వారిని వారు కాపాడుకుంటారు. విపక్షాల మీద దీనిని ప్రయోగిస్తుంటారు. నిజానికి ఆరోపణలు లేనివారు 40 నుంచి 45 శాతం మాత్రమే ఉంటారు. కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేని తనయుడు ఆశీష్ మీద రైతులను వాహనంతో ఢీకొట్టి చంపిన కేసు ఉంది. ఆశీష్ ఇప్పుడు జైలులోనే ఉన్నాడు. మహారాష్ట్రలోనూ మాలిక్ అనే మంత్రి జైలులోనే ఉన్నాడు. దీనికి తోడు 80-20 మందిర్, మస్జీద్ రాజకీయాలు అదనం. రెచ్చగొట్టే ఉపన్యాసాలు, లవ్ జిహాద్ పేరిట దాడులు ఇలా నేరాలలో భాగస్వాములుగా ఉండే నేతలకు కొదువ లేదు. ప్రముఖ నేతల మీద 122 ఈడీ, 173 సీబీఐ కేసులు ఉన్నాయి. ఇందులో 71 మంది ఎమ్మెల్యేలు, 91 మంది ఎంపీలు ఉన్నారు. కొందరు మాజీ ప్రజాప్రతినిధులు, మంత్రులు కూడా ఉన్నారు. చాలా మంది రాజకీయ పార్టీ నేతల నెత్తి మీద తల్వార్ మాదిరి కేసులు వేలాడుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి దాసరి నారాయణరావు మీద కోల్ స్కామ్ కేసు ఆయన మరణించే దాకా వేలాడింది. ఈ జాబితా చాంతాడంత ఉంది. రాసుకుంటూ పోతే డబుల్ ఇంటర్‌వెల్ ఇచ్చిన 'సంగం' సినిమా స్టోరీ అవుతుంది. అందుకే 'పాలిటిక్స్ ఈస్ ద స్కౌండ్రల్స్ గేమ్' అన్నాడో పెద్దమనిషి. వీరు దేశాన్ని ఎలా కాపాడుతారు? వీరేం దేశానికి దిశా నిర్దేశం చేస్తారు? ప్రశ్నించే వారిని, తప్పులను ఎత్తిచూపేవారిని, అన్యాయాన్ని అడ్డుకునేవారిని దేశద్రోహులంటున్నారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను జైలులో పెడుతున్నారు. ప్రజలను మోసం చేస్తున్న నేతలకు చరమ గీతం పాడాలి. అందుకు బుద్ధిజీవులు ముందుకు రావాలి.

## అనంత బాబు కేసులో నోరు విప్పని టీడీపీ

రాజమండ్రి, జూన్ 3,:గత నెల 19న ఎమ్మెల్సీ అనంతబాబు మాజీ డ్రైవర్ సుబ్రమణ్యం హత్య జరిగింది. 23న పోలీసులు అనంతబాబును అదుపులోకి తీసుకున్నారు. అయితే మధ్యలో నాలుగు రోజులు ఆ సమస్యను హైలైట్ చేయడానికి టీడీపీ అన్ని ప్రయత్నాలు చేసింది. రాష్ట్ర స్థాయిలో టీడీపీ నిజనిర్ధారణ కమిటీ వేసింది కూడా. ఇక్కడ వరకు బాగానే ఉంది. కానీ ఆ ఘటనపై టీడీపీకే చెందిన జ్యోతుల నెహ్రూ, వరుపుల రాజా ఎక్కడా పెదవి విప్పింది లేదు. అనంతబాబుకు జ్యోతుల నెహ్రూ, వరుపుల రాజా కుటుంబాలకు బంధుత్వం ఉంది. ఆ కారణంగానే వారు సైలెంట్ మోడ్‌లోకి వెళ్లినట్టు టాక్ఎన్నికల్లో జగ్గంపేట నుంచి టీడీపీ తరఫున జ్యోతుల నెహ్రూ, ప్రత్తిపాడు నుంచి వరుపుల రాజా పోటీ చేసి ఓడిపోయారు. ప్రస్తుతం ఆ నియోజకవర్గాలకు వారే పార్టీ ఇంఛార్జులు. ఘటన జరిగినప్పుడు వాళ్లిద్దరూ మాట్లాడితే బాగుంటుందని టీడీపీ నాయకులు వారి దృష్టికి తీసుకెళ్లారట. ఎమ్మెల్సీ అనంతబాబు గురించి తాము ఎన్ని మాట్లాడినా పొలిటికల్ విమర్శలుగానే ఉంటాయని.. మీరు మాట్లాడితే మరింత మైలేజ్ వస్తుందని చెప్పారట. దానికి కూడా వాళ్ల నుంచి ఎటువంటి రెస్పాన్స్ లేదట. విషయం వెలుగులోకి వచ్చిన కొద్దిగంటల్లోనే మాజీ హోంమంత్రి చినరాజప్ప వెళ్లి డ్రైవర్ సుబ్రమణ్యం కుటుంబాన్ని పరామర్శించారు. అప్పుడు కూడా నెహ్రూను వెంట తీసుకెళ్దామని ప్రయత్నించినా అటునుంచి సౌండ్ లేదట.జ్యోతుల నెహ్రూ కుమారుడు జ్యోతుల నవీన్ టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. నవీన్ సీన్‌లోకి వచ్చినా పెద్దగా ఇన్వాల్వ్ కాలేదట. వచ్చామా వెళ్లామా అన్నట్టు వ్యవహారాన్ని డీల్ చేశారట. మహానాడు ముగిసిన తర్వాత జ్యోతుల నెహ్రూ పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెడదామని అనుకున్నారట. ఆ విషయాన్ని పార్టీలో సీనియర్లు దృష్టికి తీసుకుని వెళ్లినట్టు చెబుతున్నారు. అయితే అటు నుంచి ఎవరూ స్పందించలేదట. అనంతబాబు వ్యవహారంలో లేని శ్రద్ధ ఇప్పుడెందుకని నెహ్రూ, రాజాలపై సెటైర్లు వేసినట్టు తెలుస్తోంది. టీడీపీకి ప్లస్ అయితేనే అందరికీ ఉపయోగం అని అంటున్నారట తెలుగు తమ్ముళ్లుగతంలో జ్యోతుల నెహ్రూ వైసీపీలో ఉన్నారు. శాసనసభపక్ష ఉపనేతగా కూడా పనిచేశారు. దీంతో ఆయనకు పాత పార్టీ వాసనలు, చుట్టరికాలు అడ్డు వచ్చాయో ఏమో అని శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నారట. మహానాడు తర్వాత వీరిపై పార్టీలోని మిగతా నేతల స్వరం కూడా పెరుగుతున్నట్టు టాక్. బంధాలు.. బంధుత్వాలు ఏమైనా ఉంటే గడప లోపల తేల్చుకోవాలని.. పార్టీ వరకు బయటకొచ్చి మాట్లాడితే మరోలా ఉండేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయట. పార్టీ లైన్‌లోనే వెళ్తే బాగుండేదని.. సొంత పెత్తనం వల్ల అందరికీ నష్టమేనని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారట. అయితే రాజకీయాల కోసం బంధుత్వాలను వదిలేయాలా అనేది జ్యోతుల నెహ్రూ వర్గం వాదనగా ఉందట. మొత్తానికి ఎమ్మెల్సీ అనంతబాబు ఎపిసోడ్ జిల్లా టీడీపీలో విభేదాలకు బీజం వేసింది. ఈ విషయంలో ఎవరి వాదన వారిదే. మరి సమస్యకు అధినేత ఏ విధంగా ఫుల్‌స్టాప్ పెడతారో చూడాలి.

## మాగంటి బాబు ప్రకటనతో టీడీపీ నేతల్లో కాక..



ఏలూరు, జూన్ 3, :తెలుగుదేశం పార్టీలో కొత్తరక్తాన్ని నింపి వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తామని చంద్రబాబు, నారా లోకేష్‌లు మహానాడు వేదికగా చెప్పుకొచ్చారు. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి ఆ మాటలు ఎంతవరకు వర్తిస్తాయనేది ప్రస్తుతం తమ్ముళ్ల ప్రశ్న. వచ్చే ఎన్నికల్లో ఏలూరు ఎంపీ టికెట్ ఎవరికి ఇస్తారు? మాజీ ఎంపీ మాగంటి బాబు విషయంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అని చర్చ జరుగుతోంది. 2014 ఎన్నికల్లో అతికష్టం మీద టికెట్ సంపాదించి గెలిచారు మాగంటి బాబు. 2019 ఎన్నికల్లో ఓడిపోయారు. గత ఏడాది కుటుంబంలో వచ్చిన కుదుపులతో డీలా పడ్డారు మాగంటి బాబు. మరో రెండేళ్లలో ఎన్నికలు వస్తాయన్న తొందరో.. ఆలస్యం చేస్తే ఇంకెవరైనా కర్చీఫ్ వేస్తారనే ఆందోళనో ఏమో.. ప్రత్యక్ష రాజకీయాలపై కొద్దిరోజుల క్రితం ఆయన ద్వారకా తిరుమలలో కీలక ప్రకటన చేశారు. యాక్టివ్ పాలిటిక్స్‌లో కొనసాగుతానన్నది ఆ స్టేట్‌మెంట్ సారాంశం. అప్పటి నుంచి ఏలూరు పార్లమెంట్ పరిధిలోని టీడీపీ శిబిరాల్లో ఒక్కటే చర్చ. బాబుకు మళ్లీ ఎంపీ టికెట్ ఇస్తారా? ఇస్తే పరిస్థితి ఏంటి అని ఆరాలు తీసేవారు ఎక్కువయ్యారు. 2019 ఎన్నికల్లోనే మాగంటి బాబుకు కాకుండా మరోనేతకు ఎంపీ టికెట్ ఇస్తారని ప్రచారం సాగింది. చివరి నిమిషంలో ఆయనే పోటీలో నిలిచి ఓడిపోయారు. 2014లో ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంటు పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యేలతో ఆయనకి అస్సలు కుదిరేది కాదు. ఎమ్మెల్యేలతో అంటీముట్టనట్టు ఉండటమే కాకుండా.. ఆయా నియోజకవర్గాల్లో కిందిస్థాయి కేడర్‌లో వర్గవిభేదాలను పెంచి పోషించారనే ఆరోపణలు మాగంటి బాబుపై ఉన్నాయి. పోలవరం, చింతలపూడి, కైకలూరుల్లో మాగంటి బాబు తీరువల్ల పార్టీకి చాలా నష్టం జరిగిందన్నది అక్కడ టీడీపీ నేతలు చెప్పేమాట. అలాంటిది ప్రత్యక్ష రాజకీయాల్లో సత్తా చాటుతానని మాజీ ఎంపీ చెప్పడంతో లోకల్ తెలుగుదేశం నేతల్లో కాక రేపుతోందట. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మాగంటి బాబు ఏమయ్యారు అని ప్రశ్నలు సంధిస్తున్నారు పార్టీ నేతలు. పైగా ఎలక్షన్స్ తర్వాత వైసీపీ నేతలతో చర్చలు జరపడం వెనక ఆంతర్యం ఏంటని నిలదీస్తున్నారట. ఇప్పటి వరకూ పార్టీకి దూరంగా ఉంటూ వచ్చిన మాజీ ఎంపీని ఇకపైనా దూరంగానే ఉంచడం మంచిదని అధిష్ఠానానికి సంకేతాలు పంపుతోందట కేడర్. వచ్చే ఎన్నికలను టీడీపీ కీలకంగా భావిస్తోంది. ఇలాంటి సమయంలో వర్గపోరును ప్రోత్సహించేవారిని అక్కున చేర్చుకున్నా.. ఎన్నికల్లో టికెట్ ఇచ్చినా 2019 ఫలితమే రిపీట్ అవుతుందని ముఖం మీదే చెప్పేస్తున్నారట. టీడీపీలోని ఇతర నాయకుల ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా జాగ్రత్త పడాల్సింది అధిష్ఠానమేనని తేల్చేస్తున్నారట. ఇదే విషయాన్ని అధినేత దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. చంద్రబాబు నుంచి క్లారిటీ తీసుకునే రంగంలోకి దిగాలని ఏలూరు పార్లమెంట్ పరధిలోని టీడీపీ నేతలు మాగంటి బాబుకు చెప్పకనే చెప్పేశారని చెవులు కొరుక్కుంటున్నారు. ఇదే సమయంలో మాగంటి బాబు విషయంలో మరో చర్చ జరుగుతోంది. ఆయనకు ఈ దఫా ఎంపీ టికెట్ కాకుండా.. ఏలూరు పార్లమెంట్ పరిధిలోనే ఏదో ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌కు టికెట్ ఇస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే కొత్తరక్తంతో పార్టీని పరుగులు పెట్టిస్తామని చంద్రబాబు చెప్పడంతో మాగంటి బాబు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఒక ప్రశ్న. మరి.. మాగంటి బాబు రానున్న రోజుల్లో ఏం చేస్తారో చూడాలి.

## ఫస్ట్ సోలోగామి.....

గాంధీనగర్, జూన్ 3, :ఇప్పుడే పెళ్లి చేసుకోడానికి అమ్మాయిలు లేక ఎంతో మంది అబ్బాయిలు పెళ్లి కాని ప్రసాదుల్లా మిగిలిపోతూ ఉన్నారు. తాజాగా గుజరాత్ లోని వడోదరకు చెందిన 24 ఏళ్ల క్షమాబిందు అనే అమ్మాయి తనను తానే పెళ్లాడుతోంది. విచిత్రంగా అనిపించినా ఇది ముమ్మాటికి నిజం. జూన్ 11న ముహూర్తం కూడా పెట్టేసుకుంది. ఎవరీ క్షమాబిందు: వడోదర నివాసి క్షమాబిందు జూన్ 11న తనను తానే వివాహం చేసుకోనుంది. క్షమా సోషియాలజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ప్రస్తుతం ఓ ప్రైవేట్ కంపెనీలో సీనియర్ రిక్రూట్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. ఆమె తల్లిదండ్రులిద్దరూ ఇంజనీర్లు. ఆమె తండ్రి దక్షిణాఫ్రికాలో, తల్లి అహ్మదాబాద్‌లో ఉంటున్నారు. చాలా మంది అమ్మాయిలు ఘనంగా తమను పెళ్లి చేసుకుని.. మెట్టినింటికి తీసుకెళ్లే వరుడి గురించి కలలు కంటుండగా, క్షమా తన వరుడిని తనలోనే చూసుకుంది. ఆమెకి తనంటే చాలా ఇష్టం, ఆమెకు మరెవరినీ పెళ్లి చేసుకోవడం ఇష్టం లేదు. ఆమె సంప్రదాయబద్ధంగానే చేసుకోవాలని నిర్ణయించుకుంది. గుజరాత్ లో ఇదే తొలి స్వీయ వివాహం (సోలోగమి) కానుంది. "నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోవాలి అనుకోవడం లేదు. అందుకే స్వీయ వివాహం. నేను దీనికి సంబంధించి ఆన్ లైన్ లో కూడా శోధించాను. దేశంలో ఏ మహిళ అయినా తనను తానే పెళ్లి చేసుకుందా? అని పరిశీలించాను. కానీ, ఎవరూ లేరని తెలిసింది. కనుక దేశంలో తనను తాను ప్రేమించి పెళ్లి చేసుకునే మొదటి వ్యక్తిని నేను " అని క్షమాబిందు తెలిపింది. క్షమ పెళ్లికి సన్నాహాలు దాదాపు పూర్తయ్యాయి. ఆమె పెళ్లి కోసం లెహెంగాను కూడా ఆర్డర్ చేసింది. పెళ్లి కార్డులను కూడా పంపిణీ చేసింది. అయితే వెడ్డింగ్ కార్డ్‌లో వరుడి పేరు లేదు, వధువు పేరు మాత్రమే ఉంది. తల్లిదండ్రులు ఆమెను అర్థం చేసుకోవడానికి టైమ్ తీసుకున్నా, ఆఖరికి వారిద్దరూ ఆమె ఇష్టానికి ఒప్పుకున్నారు. క్షమా తన స్నేహితుల సమక్షంలో వివాహం చేసుకోబోతోంది, ఆమె తల్లిదండ్రులు వీడియో కాల్ ద్వారా ఈ ఫంక్షన్స్ కు హాజరవుతారు. హనీమూన్ విషయానికొస్తే, క్షమా గోవాకు వెళ్లే ఆలోచనలో ఉంది. "స్వీయ వివాహం అంటే నీ పట్ల నువ్వు అంకిత భావం కలిగి ఉండడం. ఎటువంటి షరతుల్లేని ప్రేమకు నిదర్శనం. తనను తాను స్వీకరించడం. ప్రజలు తాము ప్రేమించిన వారిని పెళ్లి చేసుకుంటారు. నన్ను నేనే ప్రేమించాను.. అందుకే ఈ పెళ్లి" అని క్షమాబిందు చెబుతోంది.

## విద్యా సంస్థలకు జగన్ మార్క్ షాక్...



విజయవాడ,జూన్ 3, :పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాక ఏ విద్యాసంస్థలూ మాకు ఇన్ని ర్యాంకులు వచ్చాయి. టెన్ ఆఫ్ టెన్ ఇంత మందికి వచ్చింది, అంత మందికి వచ్చింది అంటూ ప్రకటనలు ఇవ్వడం, ఫలితాలపై ప్రచారం చేసుకోవడం, నిషిద్ధమని, ఏపీ పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుందని చెప్పారు. టెన్త్ పరీక్షల ఫలితాల విడుదలలో గతంలో గ్రేడింగ్ విధానం ఉండేదని, 2020 మార్చి నుంచి మార్కులు ప్రకటించే విధానాన్ని పున:ప్రారంభించామని తెలిపారు. విద్యార్థులకు అత్యధిక మార్కులు రావడానికి తమ విద్యాసంస్థలే కారణమని విద్యా సంస్థలు, ట్యుటోరియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రచారం చేసుకోవడానికి అనుమతి లేదన్నారు.అలాంటి ప్రచారం వల్ల విద్యార్థులపై విపరీతమైన ఒత్తిడి పడుతోందనీ, దాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారుఫలితాలను తమకనుకూలంగా ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ పరీక్షల చట్టం 7ఏ ప్రకారం వీలు లేదన్నారు. ఎవరైనా ఉల్లంఘించి ప్రచారం చేసుకున్న, ప్రకటనలు విడుదల చేసినా లక్ష జరిమానా, ఏడేళ్ల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా నారాయణ విద్యాసంస్థలను దృష్టిలో ఉంచుకునే ఈ నిషేధం ఉత్తర్వులు జారీ చేశారని పరిశీలకులు అంటున్నారు. మాజీ మంత్రి నారాయణపై ఇటీవలి కేసులు, అరెస్టులతో చెలరేగిపోయిన సర్కార్ కు కోర్టులో ఎదురు దెబ్బ తగిలిన నేపథ్యలో ఇప్పుడిలా విద్యాసంస్థల ప్రకటనలపై నిషేధం విధించిందని పేర్కొంటున్నారు.

## అట్లీ కోసం 'జవాన్' గా మారిన షారుఖ్..
## ఆసక్తికరంగా టైటిల్ టీజర్..!




బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ గత కొంతకాలంగా వరుస పరాజయాలతో సతమతమవుతున్నారు. 2018లో 'జీరో' ఫ్లాప్ అయిన తర్వాత స్టార్ హీరో మరో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురాలేదు. ఈ నేపథ్యంలో స్ట్రాంగ్ కంబ్యాక్ కోసం ఇప్పుడు మూడు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టారు. అందులో కోలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ అట్లీ తో చేస్తున్న సినిమా కూడా ఉంది.షారుఖ్ ఖాన్ హీరోగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ లో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటివరకు ఈ సినిమాకు 'లయన్' అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఈ నేఫ్యంలో టైటిల్ ను ఖరారు చేసిన మేకర్స్.. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇచ్చారు.అట్లీ – షారుక్ కాంబోలో రూపొందే సినిమాకు "జవాన్" అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు. ఈ సందర్భంగా ఒకటిన్నర నిమిషాల టీజర్ ను ఆవిష్కరించారు. ఇందులో షారుక్ ఇంతకుముందెన్నడు చూడని సరికొత్త గెటప్ లో కనిపించారు. గాయాలపాలైన ముఖానికి చేతులకు కట్లు కట్టుకుని మాస్ లుక్ తో ఆకట్టుకున్నారు.టీజర్ చివర్లో షారుక్ రెండు వైవిధ్యమైన గెటప్స్ లో కనిపించడంతో 'జవాన్' సినిమాలో షారుఖ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారా? లేదా అతని పాత్రలో రెండు వెరియేషన్స్ ఉంటాయా? అనే సందేహాలు కలుగుతున్నాయి. మొత్తం మీద బాలీవుడ్ హీరోని అట్లీ సరికొత్త అవతార్ లో పరిచయం చేస్తున్నట్లు ఈ టీజర్ ను బట్టి అర్థం అవుతుంది. ఇది సినిమాపై అంచనాలు రెట్టింపు చేస్తోంది."జవాన్" చిత్రాన్ని 2023 జూన్ 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు తమిళం మలయాళం కన్నడ హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నట్లు పేర్కొన్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై షారుక్ సతీమణి గౌరీఖాన్ ఈ యాక్షన్ ఎంటర్టైనర్ ను నిర్మిస్తున్నారు.ఇకపోతే 'జవాన్' సినిమాలో నయనతార ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్ గా నటిస్తున్నారని సమాచారం. ఇది నయన్ కు హిందీ డెబ్యూ మూవీ. ఇందులో సాన్యా మల్హోత్రా మరో కీలక పాత్రలో కనిపించనుంది. అనేక మంది సౌత్ దర్శకులు నార్త్ లోనూ సత్తా చాటారు. ఈ క్రమంలో అట్లీ తన బాలీవుడ్ డెబ్యూ మూవీతో ఎలాంటి క్రేజ్ అందుకుంటారో చూడాలి. ఇదిలా ఉంటే షారుక్ ఖాన్ ప్రస్తుతం సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో 'పఠాన్' అనే సినిమా చేస్తున్నారు. దీపికా పదుకునే హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమా 2022 జనవరి 25న విడుదల కాబోతోంది. ఇక రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో షారుఖ్ ఇటీవలే 'డంకీ' అనే చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు.

# పవన్ అభిమానులకు షాక్ ఇచ్చిన అడవి శేష్



మెగా అభిమానులకు ఎంత మంది వారసులు వచ్చినా కూడా పవన్ కళ్యాణ్ తనయుడు అకీరా రాక ఎప్పుడు అన్నట్లుగా ఎదురు చూస్తున్నారు. మెగా ఫ్యామిలీ నుండి ఇప్పటి వరకు వచ్చిన హీరోలు ఒక ఎత్తు అయితే.. ఇక నుండి రాబోతున్న పవన్ వారసుడు అకీరా ఒక ఎత్తు అన్నట్లుగా అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అదుగో ఇదుగో అంటూ అకీరా ఎంట్రీ గురించి అప్పుడే చర్చ కూడా మొదలు అయ్యింది. అకీరా సినిమాకు కథ సిద్దం అయ్యిందని... ఈయనే దర్శకుడు అంటూ కూడా కొందరు ఊహాగాణాలు సోషల్ మీడియా ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అకీరా సినిమా విషయంలో ఉన్న సస్పెన్స్ కు అడవి శేష్ ఒక క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశాడు. ప్రస్తుతానికి అకీరా కు సినిమా లు అంటే పెద్దగా ఇంట్రెస్ట్ లేదు. అతడు ఇండస్ట్రీలో అడుగు పెట్టాలని భావించడం లేదు అంటూ షాకింగ్ విషయాన్ని చెప్పాడు.అడవి శేష్ అంటే అకీరాకు ప్రత్యేకమైన అభిమానం. అడవి శేష్ నటించిన దాదాపు అన్ని సినిమాలను కూడా అకీరా చూశాడు. ఇద్దరి మధ్య మంచి సన్నిహిత్యం ఉంది.యఇటీవల మేజర్ సినిమా ప్రమోషన్ సందర్బంగా శేష్ స్పందిస్తూ అకీరా తో తనకు ఉండే బాండింగ్ ను గురించి వివరించాడు. ఇద్దరు వారం వారం కలుస్తారట. అంతే కాకుండా ఆ సమయంలో పలు విషయాల గురించి చర్చించుకుంటారట.ఇంకా అడవి శేష్ అకీరా గురించి మాట్లాడుతూ... అకీరాకు సినిమాలపై అంతగా ఆసక్తి లేదు. ప్రస్తుతం అకీరా మ్యూజిక్ నేర్చుకుంటున్నాడు. కొన్ని వాయిద్య పరికరాలను అద్భుతంగా వాయిస్తాడు. చాలా సార్లు తను సొంతంగా ట్యూన్ చేసిన మ్యూజిక్ ను అకీరా నాకు పంపిస్తూ ఉంటాడు. వాటిని వింటూ ఉంటే చాలా హాయిగా అనిపిస్తూ ఉంటుంది. అకీరా మనస్థత్వం చాలా విభిన్నంగా ఉంటుందని అడవి శేష్ అన్నాడు. అడవి శేష్ మాటలను బట్టి చూస్తుంటే అకీరా సినిమా ఇండస్ట్రీపై ప్రస్తుతం ఆసక్తిగా ఉన్నట్లు అయితే కనిపించడం లేదు. ఈ విషయమ్వై అభిమానులు స్పందిస్తూ.. పవన్ కూడా ఆసక్తి లేకుండానే ఇండస్ట్రీలో అడుగు పెట్టాడు. ఇష్టంతో అడుగు పెట్టడం కంటే ఇలా ఆసక్తి లేకుండా ఎంట్రీ ఇస్తేనే ఎక్కువ విభిన్నమైన సినిమాలు చేయవచ్చు. అందుకే తండ్రి మాదిరిగానే అకీరా కూడా ఖచ్చితంగా ఇండస్ట్రీలో అడుగు పెట్టి స్టార్ గా నిలవడం ఖాయం అంటున్నారు.

# 'ఆచార్య' ఎఫెక్ట్.. అంతా గందరగోళం

మెగాస్టార్ చిరంజీవి ఆచార్య సినిమా పై మెగా అభిమానులతో పాటు ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తి పెంచుకుని ఎదురు చూశారు. కొరటాల శివ దర్శకత్వంలో సినిమా అవ్వడంతో అంచనాలు ఆకాశాన్ని తాకాయి.కాని ఆచార్య సినిమా డిజాస్టర్ గా నిలిచింది. చిరంజీవి మరియు రామ్ చరణ్ కలిసి నటించినా కూడా అభిమానులను మరియు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఎంటర్ టైన్ చేయడంలో ఆచార్య విఫలం అయ్యాడు.ఆచార్య ఫ్లాప్ ఏమో కాని ఇప్పుడు చిరంజీవి తదుపరి సినిమాల పై చాలా ప్రభావం పడబోతుంది. ఇప్పటికే గాడ్ ఫాదర్ మరియు భోళా శంకర్ సినిమాలు విడుదలకు సిద్దంగా ఉన్నాయి. గాడ్ ఫాదర్ ను అంతా సవ్యంగా ఉంటే ఆగస్టు లో విడుదల చేయాలనుకున్నారు. కాని ఆచార్య ఎఫెక్ట్ తో విడుదల విషయంలో గందరగోళం నెలకొంది. ఇప్పటి వరకు షూటింగ్ పూర్తి అయ్యిందో లేదో క్లారిటీ లేదు.గాడ్ ఫాదర్ విడుదల అయిన వెంటనే భోళా శంకర్ సినిమాను విడుదల చేయాలనుకున్నారు. ఈ రెండు సినిమాల్లో గాడ్ ఫాదర్ సినిమా లూసీఫర్ కు రీమేక్ అనే విషయం తెల్సిందే. ఇక భోళా శంకర్ సినిమా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతుంది. ఈ రెండు సినిమాల్లో మళ్లీ కొన్ని మార్పులు చేర్పులు చేయబోతున్నట్లుగా మెగా కాంపౌండ్ నుండి వార్తలు వస్తున్నాయి.చిరంజీవి సినిమా అంటే మెగా ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ చూడాలి అనుకుంటారు. వారి అభిరుచికి తగ్గట్లుగా సినిమా లేకుంటే మాత్రం ఖచ్చితంగా ఫలితం అటు ఇటు అయ్యే అవకాశం ఉంది. అందుకే గాడ్ ఫాదర్ మరియు భోళా శంకర్ సినిమాలను ఒకటికి రెండు సార్లు.. ఇద్దరు



ముగ్గురి జడ్జ్ మెంట్ లను తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. సినిమాల విడుదల విషయం లో కాస్త గందరగోళం నెలకొన్న త్వరలోనే విడుదల విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉందంటున్నారు. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం గాడ్ ఫాదర్ సినిమా షూటింగ్ ముగింపు దశకు వచ్చినా.. కొన్ని సన్నివేశాలను రీ షూట్ చేస్తారని కూడా ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ఒక్క ఆచార్య సినిమాల వల్ల చిరంజీవి మూడు నాలుగు సినిమాలపై ప్రభావం పడింది.

# మహేష్ కోసం జక్కన్న ఇంకా స్టోరీ లైన్ ని ఫైనలైజ్ చేయలేదా..?

సూపర్ స్టార్ మహేష్ బాబు మరియు దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్ లో ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్న విషయం తెలిసిందే. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో చేయనున్న ఎస్ఎస్ఎంబీ28 సినిమా తర్వాత ఈ క్రేజీ కాంబో సెట్స్ మీదకు వెళ్లనుంది. ఎస్ఎస్ఎంబీ28 మూవీ కోసం అందరూ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు. జక్కన్న – మహేష్ కలిసి ఎలాంటి సినిమా చేయబోతున్నారు? అది ఏ జోనర్ లో ఉంటుంది? అసలు ఈ సినిమా కథేంటి? అని చర్చిస్తూనే ఉన్నారు. రాజమౌళి తండ్రి కేవీ విజయేంద్ర ప్రసాద్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మహేష్ కోసం ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఓ జంగిల్ బేస్డ్ అడ్వెంచర్ స్టోరీని అనుకున్నట్లు హింట్ ఇచ్చారు. జక్కన్న సైతం ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో మహేశ్ కోసం రెండు ఆసక్తికరమైన స్టోరీ లైన్స్ రెడీగా ఉన్నట్లు జక్కన్న తెలిపారు.ఆర్ఆర్ఆర్



సినిమా విడుదలై రెండు నెలలు దాటి పోవడంతో.. రాజమౌళి ఈ గ్యాప్ లో స్టోరీ లైన్ గురించి మహేష్ బాబుతో చర్చించి ఉంటారని అందరూ భావించారు. ముందుగా చెప్పినట్లు ఈ ఏడాది చివరి నాటికి ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తారని అనుకున్నారు. అయితే అసలు ఇంతవరకు దర్శకహీరోలు స్టోరీ గురించి చర్చించలేదని తెలుస్తోంది.ఇటీవల 'మేజర్' ప్రమోషన్స్ లో మహేష్ బాబు ఇంకా రాజమౌళికి సినిమా కథ గురించి ఖచ్చితంగా తెలియదని.. వారు కొన్ని ఐడియాల మీద వర్క్ చేస్తున్నారని.. వాటిలో ఏదీ కన్ఫర్మ్ కాలేదని తెలిపారు. ఈ సినిమా కోసం ఎంతో ఎగ్జైట్మెంట్ గా ఉన్నట్లు పేర్కొన్నారు.మహేష్ సినిమా ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో అడ్వెంచర్ డ్రామాగా ఉంటుందని వార్తలు వచ్చినప్పుడు అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. అయితే ఇప్పుడు మహేష్ దానిని ఖండించడంతో.. సూపర్ స్టార్ కోసం ఎలాంటి కథ రెడీ చేస్తున్నారో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నారు.రాజమౌళి ఒక స్టోరీ లైన్ రెడీ చేయడానికి.. ప్రీ విజువలైజేషన్ మరియు ప్రీ–ప్రొడక్షన్ కోసం ఆరు నుండి ఏడు నెలల సమయం తీసుకుంటారు. ఇదంతా జరిగేలోపు త్రివిక్రమ్ దర్శకత్వంలో మహేష్ సినిమా కంప్లీట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం యూరప్ లో హాలిడేస్ ని ఎంజాయ్ చేస్తున్న మహేష్.. తిరిగి వచ్చిన తర్వాత ఎస్ ఎస్ఎంబీ28 సెట్స్ లో అడుగు పెట్టనున్నారు. ఇదే క్రమంలో రానున్న ఎస్ఎస్ఎంబీ28 చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్ పై సీనియర్ ప్రొడ్యూసర్ కె.ఎల్.నారాయణ భారీ బడ్జెట్ తో నిర్మించనున్నారు. అపజయం ఎరుగని దర్శకుడిగా కొనసాగుతున్న రాజమౌళి.. వరుస బ్లాక్ బస్టర్స్ తో ఫుల్ ఫార్మ్ లో ఉన్న మహేష్ కలిసి ఎలాంటి సినిమాని ఆవిష్కరిస్తారో చూడాలి.

# రానా "విరాట పర్వం" ట్రైలర్ రిలీజ్ కి రెడీ!



రానా దగ్గుబాటి మరియు సాయి పల్లవి హీరో హీరోయిన్ లుగా నటించిన విరాట పర్వం జూన్ 17, 2022 న గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉంది. వేణు ఊడుగుల దర్శకత్వం వహించిన ఈ చిత్రం మళ్లీ వార్తల్లోకి వచ్చింది. సినిమా నిర్మాతలు సోషల్ మీడియాలో విరాట పర్వం యొక్క థియేట్రికల్ ట్రైలర్ను జూన్ 5, 2022న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అదే విషయాన్ని ప్రకటించేందుకు సరికొత్త పోస్టర్ను విడుదల చేశారు. ఈ పీరియాడికల్ డ్రామాలో ప్రియమణి, నివేదా పేతురాజ్, నందితా దాస్, నవీన్ చంద్ర తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రానా దగ్గుపాటి నటిస్తున్న ఈ చిత్రం పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.


స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB
SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com